
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తిరుపతి
జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 ఆగస్టు 2025

బహురూప గణేశ



ఎంఆర్‌పల్లె: గరుడ వినాయకుడు

వినాయక చవితి సందర్భంగా జిల్లావ్యాప్తంగా కూడళ్లలోని మండపాల్లో విభిన్న ఆకృతుల్లో.. భారీ ఆకారాల్లో విఘ్నేశ్వర విగ్రహాలను నెలకొల్పారు. తిరుపతి నగరంలోని విగ్రహాల్లో కొన్ని విభిన్నమైన విగ్రహాలు న్నాయి.


తీర్థకట్టవీధి: అయ్యప్ప రూపంలో..


యాదవవీధి: 4500 కామాక్షమ్మ దీపాలతో..


→ వినాయకుడికి గోమాత క్షీరాభిషేకం


నాట్య గణపతి: బంకమట్టితో ఎస్వీ శిల్పకళాశాల విద్యార్థుల తయారీ

భూమన ధర్మపరిరక్షకుడు కాదు.. భక్షకుడు



భూమన కరుణాకరరెడ్డి హిందూధర్మ పరిరక్షకుడు కాదు.. టీటీడీని దోచేసిన భక్షకుడు. కల్యాణమస్తు పేరిట ఎవరినిపడితే వారిని పట్టుకొచ్చి పెళ్లిళ్లు చేయించడం హైందవ పరిరక్షణ అవుతుందా? వైజాగ్‌లో దళితగోవిందం నిర్వహించి ఒక అగ్గిపెట్టెకు రూ.12వేలు బిల్లువేసినట్టు ఆడిట్ నివేదకలో బట్టబయలైంది. ఈ రెండు స్కీముల్లో అప్పుడు విచ్చలవిడిగా అవినీతి చేశారు కాబట్టే 2019-24లో వాటి జోలికి వెళ్లలేదు.

- ఓవీ రమణ, టీటీడీ మాజీ సభ్యుడు

వైఎస్ వల్లే ఐఏఎస్ శ్రీలక్ష్మి జైలుకెళ్లింది



ముఖ్యమంత్రిగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చెప్పినచోటల్లా సంతకాలు పెట్టిన ఐఏఎస్ శ్రీలక్ష్మి చివరకు జైలుకు వెళ్లారు. ఐఏఎస్ హోదాను ఎంతో కోల్పోయారు. ఒక మహిళా ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సంబంధించి విగ్గులు, చీరలు అంటూ విమర్శలు చేయడం మంచిది కాదు. అలాంటి విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం.

- చింతా మోహన్, కేంద్ర మాజీ మంత్రి


ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్

అమ్మవారి సేవలో ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్

తిరుచానూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారిని బుధవారం మహారాష్ట్ర గవర్నర్, ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ దర్శించుకున్నారు. మంత్రి నారాయణ, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయనకు స్వాగతం పలికారు.తొలుత ఆయన ధ్వజస్తంభానికి నమస్కరించి అనంతరం మూలమూర్తిని దర్శించుకున్నారు.ఆలయ పండితులు వేదాశీర్వచనం ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.గవర్నర్ రాధాకృష్ణన్‌తో పాటు టీటీడీ బోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, శాప్ ఛైర్మన్ రవినాయుడు, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ దర్శించుకున్నవారిలో ఉన్నారు. కార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు బాబుస్వామి తదితరులు పాల్గొన్నారు.

- రోజువారీ వెయ్యి మెగావాట్ల సామర్థ్యం
- ట్రయల్ రన్ విజయవంతం
- వాణిజ్య ఉత్పత్తికి ఎస్ఆర్ఎల్‌డీసీ నుంచీ అనుమతి

విద్యుత్ ఉత్పత్తికి 'వేదాంత- మీనాక్షి' సిద్ధం

తిరుపతి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేదాంత-మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్ సంస్థ విద్యుత్ ఉత్పత్తికి సిద్ధమైంది. విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి ట్రయల్ రన్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకుంది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం వద్ద 1996లో వికాస్ పవర్ ప్రాజెక్టు ప్రైవేట్ లిమిటెడ్ పేరిట థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి పరిశ్రమ ప్రారంభమైంది. ఆపై ఈ సంస్థ మీనాక్షి ఎనర్జీగా పేరు మార్చుకుంది. అటు తర్వాత పలు యాజమాన్యాలు మారాయి. చివరికి ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని 2019లో కార్పొరేట్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌లోకి వెళ్లింది. ఈ సంస్థను 2023లో వేదాంత లిమిటెడ్ స్వాధీనం చేసుకుంది. ఈ వేదాంత లిమిటెడ్ అనేది దేశంలోనే పేరున్న విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో ఒకటి. రెండేళ్లలోపే వేదాంత సంస్థ మీనాక్షి ఎనర్జీ లిమిటెడ్‌ను పునరుద్ధరించింది. వెయ్యి మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సంతరించుకుంది. 350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు రెండు, 150 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి యూనిట్లు రెండు చొప్పున మొత్తం నాలుగు యూనిట్లు ఏర్పాటు చేసింది. బొగ్గుతో విద్యుత్ ఉత్పత్తి చేసే ఈ సంస్థ తయారీ ప్రక్రియ కోసం మంచి నీటిని కాకుండా వంద శాతం సముద్ర ఉప్పు నీటిని వినియోగిస్తోంది. వృథాగా మిగిలే బూడిద నిల్వల నుంచీ నీటిని తిరిగి వినియోగంలోకి తెస్తోంది. ఇటీవలే చివరి యూనిట్ ఏర్పాటు పూర్తి కాగా విద్యుత్ ఉత్పత్తికి సంబంధించి 72 గంటల ట్రయల్ రన్ కూడా విజయవంతమైంది. దీంతో సదరన్ రీజనల్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచీ కమర్షియల్ ఆపరేషన్ డేట్ కూడా ఖరారైంది. మొత్తం నాలుగు యూనిట్ల నుంచీ రోజుకు వెయ్యి మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిచేసి గ్రిడ్‌లకు నిరంతరం సరఫరా చేసేందుకు పూర్తి స్థాయిలో పవర్ ప్లాంట్ సిద్ధమైంది.

ప్లాంట్ ఏర్పాటుతో 1150 మందికి ఉపాధి

వేదాంత ప్లాంట్ ఏర్పాటుతో 1150 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినట్టు ఆ సంస్థ సీఈవో రాజిందర్ సింగ్ ఆహూజా ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం సిబ్బందికి ఆధునిక డిజిటల్ సెక్యూరిటీ సిస్టమ్ కల్పించామని పేర్కొన్నారు. తమ వద్ద పనిచేస్తున్న ఉద్యోగుల్లో 21 శాతం మంది మహిళలు, 42 శాతం మంది యువ నిపుణులు ఉండటం వేదాంత పవర్ సంస్థ మానవ వనరుల సామర్థ్యాన్ని చాటుతోందని పేర్కొన్నారు. తమ సంస్థ ఏపీ అవసరాలను తీర్చడంతో పాటు భవిష్యత్ తరాలకు నమ్మకమైన విద్యుత్ సరఫరాను కొనసాగించడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.


తమ్మినపట్నం వద్ద ఉత్పత్తికి సిద్ధమైన వేదాంత-మీనాక్షి పవర్ ప్లాంట్

నేత్రదానం చేయాలనుకుంటున్నారా?

- అరవింద్ ఆస్పత్రిలో హెల్ప్‌లైను నెంబరు ప్రారంభించిన టీటీడీ ఈవో

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎవరైనా తమ మరణానంతరం నేత్ర దానం చేయడానికి సిద్ధంగా ఉన్నారా? అలాంటి వారి కోసం తిరుపతిలోని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రిలో నేత్రదాన కేంద్రాన్ని.. 93983 58828 హెల్ప్‌లైను నెంబరును టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం ప్రారంభించారు. 'డయల్ ఈవో కార్యక్రమంలో ఓ భక్తుడు టీటీడీ పరిధిలో ఒక నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభిస్తే బాగుంటుందని సూచించారు. అప్పటి నుంచి నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించేందుకు ప్రయత్నాలు చేశాం. ఆ విషయాన్ని ఎస్వీ అరవింద్ కంటి ఆస్పత్రి వారి దృష్టికి తీసుకురాగా వెంటనే నేత్రదాన కేంద్రాన్ని ప్రారంభించారు. నేత్రదానంపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. నేత్రదానం వంటి సేవా కార్యక్రమాలకు భక్తులు ముందుకు రావాలి' అని ఈవో పిలుపునిచ్చారు. ఆస్పత్రి సీఎంవో డాక్టర్ అశోక్‌వర్ధన్ మాట్లాడుతూ.. దేశంలో 11 లక్షల మంది కిపైగా కంటి చూపు కోసం ఎదురు చూస్తుంటే, వీరిలో 25 వేల మందికే దాతలు ఇచ్చిన కళ్లను అమర్చి కంటి చూపును ప్రసాదించే అవకాశం ఉందన్నారు. ప్రజలు నేత్రదానానికి ముందుకొస్తే అవసరమైన వారందరికీ కంటి చూపును ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీ కుమార్, డాక్టర్లు సురేంద్ర, బిస్వజిత్ తదితరులు పాల్గొన్నారు.



హెల్ప్‌లైన్ నంబరు ప్రారంభిస్తున్న టీటీడీ ఈవో శ్యామలరావు

మరొకరికి చూపునిస్తాం

- తనతో పాటు తన తండ్రి నేత్రదానానికి అంగీకార పత్రాన్ని అందజేసిన కలెక్టర్


నేత్రదానానికి అంగీకార పత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేత్రదానానికి కలెక్టర్ వెంకటేశ్వర్ ముందుకొచ్చారు. తనతో పాటు తన తండ్రి మరణానంతరం కళ్లు అందించేలా స్వచ్ఛందంగా అంగీకరిస్తూ ప్రతిజ్ఞాపత్రంపై సంతకం చేశారు. ఈ పత్రాన్ని గురువారం ఎస్వీ మెడికల్ కళాశాల, రుయా ఆస్పత్రి నేత్ర విభాగం అధిపతి చలపతిరెడ్డికి అందించారు. నేత్రదానం చేసేందుకు ప్రజలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేత్రదాన పక్షోత్సవాలను పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్‌తో కలిసి ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నేత్రదానానికి సంబంధించి ప్రతిజ్ఞాపత్రం అందజేశారు. ఒకరు నేత్రదానం చేయడం వల్ల మరో ఇద్దరికి కంటి చూపు వస్తుందన్నారు. నేత్రదానాన్ని కుటుంబం సంప్రదాయంగా చేసుకోవాలని సూచించారు. సెప్టెంబరు 8వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని దాని విశిష్టతను తెలుసుకుని తాము నేత్రదానం చేయడమే కాకుండా తోటివారినీ ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలోమ డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, రుయాస్పత్రి సూపరింటెడెంట్ రాధ, ఐబ్యాంకు టెక్నీషియన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




ధ్వజపటానికి హారతి ఇస్తున్న అర్చకుడు ధర్మేశ్వర గురుకుల్ - హంస వాహనంపై వినాయకస్వామి

ముక్కంటి సేవలో విదేశీ భక్తులు



శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని గురువారం పలువురు విదేశీ భక్తులు దర్శించుకున్నారు. మైసూరుకు చెందిన తపస్వని యోగాశ్రమం ద్వారా ఇటలీకి చెందిన ఏడుగురు, అమెరికాకు చెందిన ఇద్దరు భారత సంప్రదాయ వస్త్రధారణతో వచ్చారు. వీరికి ఆలయ అధికారులు దర్శన ఏర్పాట్లుచేశారు. వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని వారు కొనియాడారు.



బ్రహ్మోత్సవ వైభవం

- కాణిపాకంలో ఘనంగా చవితి వేడుకలు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. బ్రహోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. వినాయక వ్రతాన్ని నిర్వహించారు. రాష్ట్రప్రభుత్వం తరపున దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కమిషనర్ రామచంద్రమోహన్, ఎమ్మెల్యేలు తదితరులను పట్టు వస్త్రాలను సమర్పించారు. సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లను బుధవారం రాత్రి పురవీధులలో ఊరేగించారు. ఇక, బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు.స్వాతి నక్షత్ర యుక్త శుభలగ్నంలో మూషిక ధ్వజపటాన్ని నింగికి ఎగుర వేశారు. గురువారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమంలో భాగంగా యాగశాల ప్రవేశ పూజను నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఈవో పెంచల కిషోర్‌కు, ఆలయ అర్చకులు ధర్మేశ్వరగురుకుల్‌కు రక్షా బంధనాన్ని కట్టారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభానికి, మూషికానికి రక్షా బంధనాన్ని కట్టారు. రాత్రి స్వామికి హంస వాహన సేవను నిర్వహించారు. రాత్రి ఉభయ వరస రావడంతో అలంకార మండపంలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవర్లకు పూజలు నిర్వహించాక హంస వాహనంపై ఉంచి ఊరేగించారు.

పార్వతీ తనయా..పాహిమాం



భాకరాపేటలో వినాయకునికి పూజలు చేస్తున్న మహిళలు





చిగురువాడ - పాకాలలో కొలువుదీరిన వినాయకుడి ప్రతిమలు

పాకాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోలాహలంగా వినాయక చవితి వేడుకలు జరుపుకొన్నారు. స్థానిక సంతగేటు, న్యూకాలనీ, పాత పోస్టాఫీసు ఎదురుగా, కమతంపల్లె, సత్యమ్మ గుడి సమీపంలో బజారు వీధి తదితర ప్రాంతాల మండపాలలో విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కుందేటిపల్లె, అడుసుపల్లె, పాలినేనివారిపల్లె, ఉప్పరపల్లె దళితవాడ, తలారిపల్లె గ్రామాలలో చవితి సందడి నెలకొంది. **భాకరాపేట:** చిన్నగొట్టిగల్లు మండలంలోని వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. పండుగ రోజు రాత్రి యువత సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను ఉత్తేజపరిచాయి. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో భారీ విగ్రహాలు ఏర్పాటు చేశారు. **తిరుపతి రూరల్:** తుమ్మలగుంటలో శివలింగంతోపాటు పానవటంపై కూర్చుని చేతిలో తుంబుర పట్టుకుని ధ్యానం చేస్తున్నట్లుగా బంకమట్టి..గడ్డితో రూపొందించిన వినాయక ప్రతిమ విశేషంగా ఆకట్టుకుంది. బాలవినాయక కమిటీ ఆధ్వర్యంలోని ఉత్సవాలకు వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.



తిరుపతి రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని ఓం నమో వెంకటేశాయ ఆటోస్టాండ్ వారు నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మౌనారెడ్డి, డాక్టర్ బాబు, సుబ్రహ్మణ్యం, నర్సింగ్ సూపరింటెండెంట్ సుప్రియ, ఆటోస్టాండ్ నాయకుడు వేణు తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో వసతులకు చింత



రోడ్డుపైనే నిర్వహిస్తున్న వారపుసంత

పాకాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారపుసంతలో వసతులు లేక రైతులు, వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో సంతస్థలం విశాలంగా ఉండేది. ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సుకు, ఆర్టీసీ బస్టాండుకు కొంతమేర కేటాయించడంతో స్థలం కుదించుకుపోయింది. భారతమిట్టకు వెళ్లే రోడ్లపైనే సంత జరుగుతోంది. వాహనాలు బస్టాండు ఆవరణలో పార్కు చేయడం వల్ల బస్సులు తిరగడానికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది.. సోమవారం సంతరోజు భారతంమిట్టలోని 11 వీధులు, శివశక్తినగర్, ఎల్బీఎస్ నగర్‌కు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకు స్థలంలో కూరగాయలు కొనుగోలుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ వారపుసంత ద్వారా ఏటా సుమారు రూ.22 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పార్కింగ్ వసతి కల్పించాలని, విశాలమైన స్థలంలో వారపుసంత ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ముందుకు కదలని మురుగుతో ఇబ్బందులు



తిరుపతి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): గాంధీపురం పంచాయతీలోని శ్మశానవాటిక మురుగునీటి నిలతో అధ్వానంగా తయారైంది. తుమ్మలగుంట పంచాయతీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక ఉప్పరపల్లె, స్పందన అపార్ట్‌మెంట్స్, రెండు ప్రైవేట్ కళాశాలల నుంచి మురుగునీరు, టాయిలెట్ వ్యర్థాలు శ్మశాన వాటికలోకి చేరుతున్నాయి. ఈమురుగునీరు ముందుకు కదలక దుర్వాసన భరించలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. అనారోగ్యాల బారినపడుతున్నామని, దోమల బెడద అధికమైందని వాపోతున్నారు. మరో పంచాయతీకి చెందిన మురుగునీరు చేరుతున్నా పట్టించుకోవడంలేదంటున్నారు. ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ చల్లాలని కోరుతున్నారు. ఎమ్మెల్యే నాని దృష్టి సారించినా నిధుల కొరత కారణంగా ఇప్పటివరకూ కార్యరూపం దాల్చని పరిస్థితి ఉందంటున్నారు. శాశ్వత చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బీసీ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రాన్ని అందజేసి సమస్యలను వివరిస్తున్న నాయకులు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): టీటీడీ బీజీ ఉద్యోగుల సమస్యలపై టీటీడీ బీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ మంత్రి సవితకు వినతిపత్రాన్ని అందజేశారు. తిరుమలలో గురువారం ఆమెను బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రమోషన్ల అమలు, మిరాసిదార్ క్షౌరవేత్తల వారసుల నియామకం, బీసీ ఉద్యోగుల బదిలీల వంటి సమస్యలను వినతిపత్రంలో వారు ప్రస్తావించారు. టీటీడీ బీసీ ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ మీటింగ్ చాలా ఏళ్లుగా జరగడం లేదని, త్వరగా ఒక గ్రీవెన్స్ మీటింగ్‌ను టీటీడీ ఈవో, జేఈవోతో జరిపించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కామరాజు, యువరాజ్, నాగేంద్ర, పీజీ వెంకటేష్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి 162వ జయంతి సందర్భంగా శుక్రవారం ఎస్వీయూ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించనున్నట్లు తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ తెలిపారు. ఆసక్తి కలిగిన ఎవరైనా హాజరుకావచ్చునని పేర్కొన్నారు

వసతి గృహంలో చోరీకి యత్నం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని వైద్య విద్యార్థుల వసతిగృహంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి చోరీకి ప్రయత్నించాడు. విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు తప్పించుకుని పారిపోయాడు. సెక్యూరిటీ మేనేజరు శంకర్ ఘటనపై ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులు కళాశాల, ఆస్పత్రి పరిసరాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

అన్నప్రసాదాలు రుచిగా ఉన్నాయి

● మంత్రి సవిత



తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో అన్నప్రసాదాలు చాలా రుచికరంగా, పరిశుభ్రంగా ఉన్నాయని మంత్రి సవిత అన్నారు.బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆమె ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ, ఇంట్లో కూడా లేనంత రుచిగా అన్నప్రసాదాలు అద్భుతంగా ఉన్నాయని దేశవిదేశాల నుంచి వచ్చి భక్తులు చెప్పడం సంతోషాన్ని కలిగించిందన్నారు.

టీటీడీ చరిత్రలో చీకటి యుగం: భూమన

తిరుపతి(జీవకోన), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడి పాలన టీటీడీ చరిత్రలో చీకటి యుగమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి విమర్శించారు. తిరుపతిలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, టీటీడీ స్థలాన్ని టూరిజంకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నిస్తే ఇప్పటివరకు చైర్మన్ సమాధానం చెప్పలేదన్నారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. తాను వేలకోట్లు సంపాదించానని చెబుతున్న ఆయన.. తనకు రూ.100కోట్లు ఇచ్చి ఆ ఆస్తినంతా తీసుకోవచ్చని సూచించారు.

తిరుమల ఘాట్‌రోడ్లలో చవితి వేడుకలు



తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల ఘాట్‌రోడ్లలోని వినాయక ఆలయాల వద్ద బుధవారం చవితి వేడుకలు జరిగాయి. రెండో ఘాట్‌లోని అలిపిరి చెక్‌పాయింట్ సమీపంలోనూ, మొదటిఘాట్‌రోడ్డులోని వినాయక స్వామి ఆలయంలోనూ ఈ వేడుకలు జరిగాయి. ప్రత్యేక అలంకరణాలో పూజలు, నైవేద్యాలు సమర్పించి వాహనదారులకు అన్నప్రసాదాల వితరణ చేశారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ

ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సాయితేజ, రమేష్ మోటారు సైకిళ్లపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయితేజ, రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయితేజను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పెళ్లకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి జాతీయ రహదారిపై గురువారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. పెళ్లకూరులోని చెన్నకేశవ స్వామి దేవాలయానికి చెందిన భూముల వేలంపాటకు దేవదాయశాఖ ఈవో హరికృష్ణ వచ్చారు. వేలంపాట వాయిదా పడటంతో ఈవో తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన వెళ్తున్న కారు పెన్నేపల్లి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు దెబ్బతినగా, రవికృష్ణకు ఎలాంటి గాయాలు కాలేదు.

స్వర్ణముఖి నదిలో వృద్ధురాలి మృతదేహం

పెళ్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు స్వర్ణముఖినదిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు... శ్రీకాళహస్తి పట్టణం ఎస్‌డీకే నగర్‌కు చెందిన నారా ఆదెమ్మ (75) ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం ఉదయం కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గ్రామీణ రహదారులకు మంచిరోజులు

● రూ.4.43 కోట్లతో 78 సీసీ రోడ్ల మంజూరు ● ఇప్పటికే 90 శాతం పనులు పూర్తి



చట్టేవారిపాళెంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు



బొల్లినేనివారిపల్లెలో సిమెంటు రోడ్డు

భాకరాపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో గ్రామాల రహదారుల రూపురేఖలు మారుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో గాలికొదిలేసిన రోడ్ల పనులపై ఇప్పుడు ఫోకస్ పెట్టారు. ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చిన్నగొట్టిగల్లు మండలంలో 78 సీసీ రోడ్లు మంజూరయ్యాయి. వాటిలో భాకరాపేట పంచాయతీలో 11, చిన్నగొట్టిగల్లు పంచాయతీలో 14, చిట్టేచర్ల పంచాయతీలో 10, దేవరకొండలో 4, దీన్‌దార్లపల్లెలో 4, జంగావాండ్లపల్లెలో 4, ఎగవూరు పంచాయతీలో 4, నెల్లుట్లవారిపల్లె, టి.చట్టేవారిపాళెం పంచాయతీలలో ఆరు , దిగవూరు, తిప్పిరెడ్డిగారిపల్లె పంచాయతీలకు ఐదు , రంగన్నగారిగడ్డ, కోటబైలు పంచాయతీలలో రెండు చొప్పున మంజూరయ్యాయి. వీటిలో సుమారు 90 శాతం పూర్తయ్యాయి. ఆయా గ్రామాలలో వర్షాకాలంలో వీధులలో బురద అంటుకునే పరిస్థితి లేకుండాపోయింది. 78 రోడ్లకు గాను రూ.4.43 కోట్లు మంజూరయ్యాయి. రోడ్ల నిర్మాణాలతో ప్రజల్లో సంతోషం వ్యక్తం అవుతోంది.

రేపు చంద్రగిరిలో స్త్రీశక్తి విజయోత్సవ సభ

● ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాని,నాయకులు

చంద్రగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ మార్కెట్ యార్డు అవరణలో శనివారం స్త్రీశక్తి విజయోత్సవ సభను నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. సభా ప్రాంగణం, భోజన వసతికి తగిన రీతిలో ఏర్పాటు చేయాలని నాయకులకు సూచించారు. మహిళలకు ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు మండలాల నుంచి 10 వేల మహిళలతో సభను నిర్వహిస్తున్నామన్నారు. నాగాలమ్మ మలుపు నుంచి మార్కెట్ యార్డుకు పాదయాత్రగా మహిళలు చేరుకుంటారన్నారు. కూటమి ప్రభుత్వంలో సూపర్‌సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేయడం, ప్రస్తుతం మహిళల కోసం అమలు చేసిన స్త్రీశక్తి పథకం విజయవంతం కావడంతో సభ నిర్వహిస్తున్నామన్నారు. తుడా మాజీ డైరెక్టర్ బాలకృష్ణమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ రాజులగారి వినోద్‌రెడ్డి, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి కొందూరు ప్రవీణ్‌రాయల్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటముని, టీడీపీ పట్టణాధ్యక్షుడు సక్కూర్ ధనంజయరెడ్డి, సీనియర్ నాయకులు వీరంగారి రమేష్‌రెడ్డి, శుభగిరినాయుడు, మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్‌రెడ్డి, మంగాపురం భాస్కర్‌రాయల్, లోకాద్రినాయుడు, గురుమూర్తిరెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

టీటీడీని రోడ్డుపైకి లాగొద్దు

● భూమనకు ఓవీ రమణ హితవు

తిరుపతి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): 'టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడితో మీకు వ్యక్తిగత విద్వేషాలు ఉండొచ్చు. కానీ పదేపదే టీటీడీ గురించి మాట్లాడడం సరైంది కాదు. టీటీడీని రోడ్డుపైకి లాగొద్దు' అని భూమన కరుణాకరరెడ్డికి టీటీడీ మాజీ సభ్యుడు ఓవీ రమణ గురువారం సూచించారు. 'కొన్నిరోజులుగా టీటీడీపై మాజీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి చేస్తున్న దుష్ప్రచారంపై ఒకప్పటి సభ్యుడిగా స్పందించాలనుకుంటున్నా. 2004లో వైఎస్ఆర్ సీఎం అయిన తర్వాత అడ్డదిడ్డంగా టీటీడీ పదవిని భూమనకు కట్టబెట్టారు. ఆ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. భూమన చైర్మన్‌గా సింగిల్ అజెండాతో పాలక మండలి సమావేశం పెట్టించిన విషయం తెలియదా? టీటీడీ చైర్మన్‌గా రెండుసార్లు పనిచేసిన ఆయన సామాన్య భక్తులకు అవసరమైన ఒక్క నిర్ణయమైనా తీసుకున్నారా? రుషికేష్‌లో 20 ఎకరాల స్థలాన్ని నొక్కేయాలనిచూస్తే దాత ఆ స్థలాన్ని విరాళంగా ఇవ్వకుండా వెళ్లిపోయారు.

రోజుకు లక్షమంది యాత్రికులు వచ్చేస్థలంలో చిన్నచిన్న తప్పిదాలు జరుగుతుంటాయి. మీ హయాంలో కొండపైన వ్యభిచారం జరుగుతోంది, మద్యం ఏరులైపారుతోందని సాక్షాత్తు చిన్నజియ్యర్ స్వామే చెప్పారు కదా!టీటీడీలో ఇంజనీరింగ్ విభాగంలో కమీషన్లు తీసుకోవాలన్న ఆలోచన గతంలో పనిచేసినవారికెవరికైనా వచ్చిందా? ప్రసాదంలో నెయ్యి కల్తీ జరగలేదని చెప్పగలరా? జగన్ ముమ్మాటికీ క్రైస్తవుడే. తాడేపల్లి, లోటస్‌పాండ్ గోడలపై కనిపించే బైబిల్ సూక్తులే నిదర్శనం' అని మండిపడ్డారు.

టీటీడీలో పారిశుధ్య కార్మికుల వేతనాలు పెంచాలి



టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):టీటీడీలో పనిచేసే పారిశుధ్య కార్మికులకు వేతనాలు పెంచాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండు చేశారు. రుయా, మున్సిపాలిటీల్లో దాదాపు రూ. 18 వేల వరకు జీతాలిస్తున్నా టీటీడీలో మాత్రం రూ. 11,600లు మాత్రమే ఇస్తూ వారి శ్రమను దోచుకోవడం అన్యాయమన్నారు. కార్మికులకు రూ. 18,600 జీతం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి తదితరులతో కలిసి గురువారం ఆయన టీటీడీ పరిపాలనా భవనం ముందు నిరసన వ్యక్తం చేశారు.

బంజారాల మనోభావాలు దెబ్బతీయొద్దు

● హథీరాంజీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతి స్వామి



హథీరాంజీ మఠం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న హథీరామ్ మహాసంఘ సభ్యులు

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : హథీరాంజీ మఠం నిర్మాణాలు బంజారాల మనోభావాలకు సంబంధించిన అంశమని, భవనం కూల్చివేయాలనే శ్రీనివాసనంద స్వామి మాటలను వెనక్కు తీసుకోవాలని హథీరాంజీ మహాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు గణపతి స్వామి డిమాండ్ చేశారు. శ్రీనివాసనంద స్వామి వ్యాఖ్యలకు నిరసనగా తిరుపతి గాంధీ రోడ్డులోని హథీరాంజీ మఠం వద్ద గురువారం వ్యక్తం చేశారు. గణపతి స్వామి మాట్లాడుతూ శ్రీనివాసనంద స్వామి వ్యాఖ్యలు బంజారాల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని చెప్పారు. పురాతన కట్టడాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో తాము కూల్చకూడదనే డిమాండ్‌ను తీసుకొచ్చామని, దెబ్బతిన్న భవనాలకు రెట్రో ఫిటింగ్ చేయిస్తే సరిపోతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శ్రీనివాసనంద స్వామి మాటలకు అనుగుణంగా మఠం భవనం వద్ద ఎటువంటి చర్యలు తీసుకున్నా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హథీరాంజీ మహాసంఘ్ కార్యదర్శి ఎస్ఎన్.కృష్ణనాయక్, ఏలూరు జిల్లా ఉపాధ్యక్షులు వేణుగోపాల్ నాయక్, రమేష్ మహారాజ్, మునిస్వామి మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

'వ్యర్థాలతో రోడ్డు నిర్మాణమా'

తిరుపతి రూరల్, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): పేరూరు పరిధిలో జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా చేపడుతున్న సర్వీసు రోడ్డు నిర్మాణ పనులకు వ్యర్థాలను వినియోగించడం వల్ల నాణ్యత లోపిస్తుందని రూరల్ ఎంపీపీ చంద్రమోహన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి నిర్మాణంలో తొలుత వ్యర్థాలను వేసి దానిపై భాగాన రహదారి పక్కన ఉన్న మంచిమట్టిని తవ్వితీసి పోసి చదును పనులు చేపడుతున్నారన్నారు. ఈ వ్యర్థాలను తొలగించి మంచి మట్టితో పనులు చేపట్టేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మధుసూదన్



మధుసూదన్‌ను అభినందిస్తున్న మాధవ్

తిరుపతి(విద్య), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా తిరుపతికి చెందిన జల్లి మధుసూదన్ నియమితులయ్యారు. 13 జిల్లాల నుంచి 14 మందిని నియమిస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అందులో జిల్లా నుంచి జల్లి మధుసూదన్‌కు అవకాశం దక్కింది. ఈ సందర్భంగా ఆయన మాధవ్‌ను కలిసి శ్రీవారి ప్రసాదం అందించి కృతజ్ఞతలు తెలిపారు.

దుబాయి కరెన్సీ పేరిట రూ.5లక్షలకు టోకరా



బాధితుడి బ్యాగ్‌ను పరిశీలిస్తున్న పోలీసులు

చంద్రగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దుబాయి కరెన్సీ పేరిట టోకారా వేశాడో దుండగుడు.. పోలీసుల కథనం ప్రకారం వీలేరులోని చెన్నారెడ్డికాలనీకి చెందిన సలీం బాషా అగరుబత్తీల వ్యాపారం చేస్తుంటాడు. పది రోజుల క్రితం అతని దగ్గరకు ఓ అపరిచిత వ్యక్తి వచ్చాడు. తన వద్ద దుబాయి కరెన్సీ ఉందన్నాడు. తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. ఒక నోటు ఇచ్చి నమ్మించాడు. తర్వాత తన వద్ద ఉన్న రూ.5లక్షల దుబాయి కరెన్సీని తక్కువ ధరకు ఇస్తానని చెప్పాడు. సలీంబాషాను బుధవారం చంద్రగిరి లైబ్రరీ వద్దకు రమన్నాడు. అతడి మాటలను నమ్మి వచ్చిన సలీంబాషాకు సదరు మోసగాడు దుబాయి కరెన్సీ అంటూ ఓ బ్యాగు ఇచ్చాడు. దానిని తీసుకుని బాషా అతనికి మన దేశ కరెన్సీ రూ.5లక్షలు చెల్లించాడు. ఇదే సమయంలో మాయమాటలు చెబుతూ కాస్సేటికే అపరిచితుడు అక్కడ నుంచి వెళ్లిపోయాడు. తర్వాత సలీంబాషా బ్యాగు తెరిచి చూడగా న్యూస్‌పేపర్ల కట్ట ఉంది. మోసపోయినట్లు గ్రహించి బాధితుడు పోలీసులకు ఫిర్యాదుచేశాడు. పోలీసులు కేసును విచారిస్తున్నారు.

పోలేరమ్మ జాతరకు తొలిచాటు

వెంకటగిరిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి గ్రామదేవత పోలేరమ్మ జాతరకు తొలిచాటు కార్యక్రమాన్ని బుధవారం అర్ధరాత్రి సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ఎస్వీబీసీ మాజీ చైర్మన్ డాక్టర్ బీవీ సాయికృష్ణ యాచేంద్ర బుధవారం ఉదయం దేవదాయశాఖ ఈవో శ్రీనివాసరెడ్డి, జాతర నిర్వహకులకు తాంబూలం అందించి జాతర నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో అంకురార్పణ జరిగింది. సెప్టెంబరు 10,11 తేదీల్లో పోలేరమ్మ జతర నిర్వహించనున్నట్లు బుధవారం అర్ధరాత్రి నుంచి చాటింపు వేశారు.









తిరుపతి టి.నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి పూజలు చేసిన తుడా మాజీ చైర్మన్లు ఎన్వీ ప్రసాద్, నరసింహ యాదవ్, టీడీపీ నేతలు సుబ్బు యాదవ్, శంకర్ యాదవ్- 35వ డివిజన్లో జరిగిన చవితి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నేతలు వెంకటముని, ఎస్వీఎం శ్రీధర్, మహేష్ యాదవ్, జగ్గా శ్రీనివాసులు, రవితేజ, రూపేష్, శరత్- ఎమ్మార్‌పల్లి సర్కిల్లోని వినాయక విగ్రహం వద్ద గుండ్లూరు వెంకటరమణ, పోలీస్ అధికారులు - అనంతవీధిలోని వినాయక విగ్రహానికి పూజలు చేస్తున్న జనసేన నాయకుడు ఆముదాల వెంకటేష్ తదితరులు

31న ఆదిభట్ల నారాయణదాసు జయంతి

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ హరికథా కళాకారుడు మద్దజ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలను ఈనెల 31వ తేదీన మహతి కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటి నుంచి పదో తేదీ వరకు హరికథ కళాకారులకు హరికథ వైభవం పేరిట శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హరికథా ప్రవేశమున్న వారు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకునేందుకు ధర్మ ప్రచార పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సీమాంధ్ర బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా లీలాకుమార్‌యాదవ్



తిరుపతి అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సీమాంధ్ర బీసీ సంక్షేమ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా మంగళం రణధీరపురానికి చెందిన టి.లీలాకుమార్‌యాదవ్ నియమితులయ్యారు. తనపై నమ్మకముంచి పదవి అప్పగించిన సంఘం నేతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సంఘం బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

అన్నదానం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తుడా రోడ్డులోని వినాయక నగర్ కట్టపై వెలసిన వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద గురువారం అన్నదానం చేశారు. దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, గుండాల గోపినాథరెడ్డి ముఖ్య అతిథులుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు వెయ్యి మందికి అన్నదానం చేశారు.అంతకు ముందు ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు వాసు పద్మావతి, మునికృష్ణారెడ్డి, వాసు, చెంగారెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి,దొరై కన్నయ్య, రామకృష్ణారెడ్డి, సాయి పాల్గొన్నారు.

ఘనంగా సుమన్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న అభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): సినీ నటుడు సుమన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. సుమన్ అభిమాన సంఘం అధ్యక్షుడు నారాయణగౌడ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. టీడీపీ నేత భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ సినీ రంగంలో రాణించిన సుమన్ రాజకీయ ప్రవేశం చేసి ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, పవన్, మణికంఠ, కోదండరామిరెడ్డి, రవిబాబు, నాగరాజు, ఈశ్వరయ్యగౌడ్ పాల్గొన్నారు.

క్వాంటం టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని

తిరుపతి (విశ్వవిద్యాల యాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పద్మావతి మహిళా యూని వర్సిటీ వీసీ ఉమ పేర్కొ న్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్-2025లో భాగంగా పద్మావతి వర్సిటీలో గురువారం ఇంటర్నల్ హాకథాన్ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీకి ప్రస్తుతం ప్రాముఖ్యత ఏర్పడిందని, దీనిపై అవగాహన ఉన్న వారికి ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందని అన్నారు. రిజిస్ట్రార్ ఎస్.రజని మాట్లాడుతూ టెక్నాలజీలోనూ సృజనాత్మకతను ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు.









సందడిగా 'ఇంటి గణపయ్య' నిమజ్జనం







నిమజ్జన వేడుకల్లో కమిషనర్ మౌర్య, సీఐ రామ్‌కిషోర్, కమిటీ సభ్యులు

తిరుపతి (జీవకోన), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను పురస్కరించుకుని బుధవారం ఇంటి గణపయ్యలు వినాయకసాగర్‌కు తరలివచ్చారు. చిరుజల్లుల నడుమ స్థానికులు సాయంత్రం ఐదు గంటల నుంచి గణపయ్యలను సాగర్‌కు తీసుకొచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించి నిమజ్జనం చేశారు. కమిషనర్ మౌర్య ఇందులో భాగస్వాములయ్యారు. నిమజ్జన కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్, నవీన్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, ఆర్సీ మునికృష్ణ, గుండాల గోపినాథ్, ఆదం సుధాకర్‌రెడ్డి, కరాటే శ్రీను, చెన్నం నవీన్ పాల్గొన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

ఐదో రోజైన ఆదివారం నిమజ్జనాన్ని పురస్కరించుకుని నగరపాలకసంస్థతోపాటు ఇతర శాఖల అధికారులు వినాయకసాగర్‌లో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం, అలిపిరి సీఐ రామకిషోర్ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైన చోట్ల బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలని కమిషన్ మౌర్య అధికారులను ఆదేశించారు.

కపిలేశ్వరాలయంలో ఘనంగా వేడుకలు



మూషిక వాహనంపై వినాయకుడి తిరువీధుల విహారం

తిరుపతి(కల్చరల్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : స్థానిక కపిలేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వినాయక చవితి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్వామిని ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి మూలవర్లకు పసుపు, గంధం, పాలు, పెరుగు, తేనె వంటి ద్రవ్యాలతో అభిషేకం చేశారు. సర్వాంగ సుందరంగా అలంకరించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. సాయంత్రం స్వామి మూషిక వాహనంపై తిరువీధుల్లో ఊరేగి భక్తాదులకు దర్శనమిచ్చారు. అలాగే గోవిందరాజస్వామి, కోదండరామస్వామి, తాతయ్యగుంట గంగమ్మ ఆలయాల్లోనూ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శనం చేసుకున్నారు.

ఎస్పీ కార్యాలయంలో వినాయక చవితి పూజ



వినాయక పూజలో ఎస్పీ హర్షవర్ధనరాజు

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ హర్షవర్ధన రాజు ఆధ్వర్యంలో బుధవారం వినాయకచవితి పూజ నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ పండుగ శుభాకాంక్షలు చెప్పారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, రిజర్వు అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల నిఘాలో నిమజ్జనం

ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధనరాజు



తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సీసీ కెమెరాల నిఘాలో జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎస్పీ హర్షవర్ధనరాజు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. వినాయక సాగర్ వద్ద నాలుగు క్రేన్లు ఏర్పాటు చేస్తున్నారు. చుట్టుపక్కల 13 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు. క్షణక్షణం అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతియుత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ అందించారు. ఎన్ఎస్ఎస్, స్టూడెంట్ అఫైర్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఉషారాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ స్థితిలో తమను తాము కాపాడుకోవడానికి స్వీయ రక్షణ విద్య అవసరమన్నారు. దీని వల్ల ఆత్మ విశ్వాసం, ధైర్యం, చురుకుదనం పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నీరజ, కరాటే నిపుణులు రత్నాకర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

ఘనంగా చవితి సంబరం



రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో శ్రీవినాయక ఆటో డ్రైవర్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమంలో బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి - వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్న టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి(జీవకోన), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో శ్రీవినాయక ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డి అండ్ రెడ్డి కాలనీలో ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజల్లో టౌన్‌బ్యాంకు మాజీ డైరెక్టర్, టీడీపీ నేత భువన్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు షణ్ముఖం, రమణ, దుర్గ, సర్వేశ్వరరావు, రఫీ, కన్నయ్య, కోడూరు సుబ్రహ్మణ్యం, చిన్నప్ప పాల్గొన్నారు.

విద్యుత్ రంగాన్ని ఆదాయ వనరుగా మార్చేశారు



విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దుపై ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష నాయకులు

తిరుపతి (ఆటోనగర్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యుత్ రంగాన్ని అదానీ, అంబానీలకు ఆదాయ వనరుగా మార్చిందని వామపక్ష నేతలు ఎ.రామానాయుడు, వి.నాగరాజు, ఆర్.హరికృష్ణ ఆరోపించారు. బైరాగి పట్టెడలోని సీపీఐ కార్యాలయంలో గురువారం విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డి, బాలస్వామిలకు జోహార్లు అర్పించారు. స్థూపం వద్ద నివాళులర్పించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు అమర్చడం రద్దు చేసేవరకు పోరాటం విరమించేది లేదని ప్రతిజ్ఞ చేశారు. ప్రజలకు విద్యుత్ చార్జీల వాతలు పెట్టి, కోతలు విధించి అంబానీ, అదానీలకు ఆదాయం చేకూర్చడానికి స్మార్ట్ మీటర్లు అమర్చడానికి ప్రభుత్వం అంగీకరించిందని మండిపడ్డారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరీష్, పి.మురళి, విశ్వనాథ్, వేణు, వెంకటరత్నం, బాలసుబ్రమణ్యం, జయచంద్ర, సాయిలక్ష్మి, ఆర్.వెంకయ్య, జె.నాగరాజు, అరుణ, ప్రమీల, విజయ పాల్గొన్నారు.

అన్న ప్రసాదాల పంపిణీ



బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అనూష జన్మదినం సందర్భంగా తీర్థకట్ట వీధిలోని భజన మందిరం వద్ద వెంకటేశ్వరస్వామికి బీజేపీ నేతలు పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, వేదం హరి, డాక్టర్ వనజ, నాగార్జున, ప్రజ్ఞశ్రీ, చలపతి, కిషోర్ పాల్గొన్నారు.

- తిరుపతి(ఉపాధ్యాయనగర్)

మెప్మాలో అవకతవకలపై విచారణ చేపట్టాలి

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుపతి మెప్మా పరిధిలోని డ్వాక్రా సంఘాల్లో డబ్బు స్వాహా చేస్తున్న వారిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. కొన్ని సంవత్సరాలుగా మెప్మాలో కొందరు అధికారులతో డ్వాక్రా లీడర్లు కలిసి అవకతవకలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. నెలనెలా బ్యాంకుల్లో చెల్లించాల్సిన సొమ్ము లెక్కలు అధికారులు ఎందుకు తనిఖీ చేయడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో దోపిడీ విచ్చలవిడిగా సాగుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయాలని కోరారు.

స్మార్ట్ సిటీ పనులు పూర్తి చేయండి

తిరుపతి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి) : స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని చైర్మన్‌గా ఉన్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. తిరుపతి స్మార్ట్‌సిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం గురువారం నిర్వహించారు. ఆన్లైన్ ద్వారా తుడా వీసీ శుభం బన్సల్ పాల్గొనగా నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య పాల్గొన్నారు. పురోగతిలో ఉన్న ప్రాజెక్టు పనులను త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. 6 మెగా వాట్స్ సోలార్ ప్రాజెక్టు పరిశీలించి పీపీపీ మోడ్‌లో నిర్వహణ చేసేందుకు టెండర్లు పిలవాలని నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ ప్రాజెక్టు త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ ఇండిపెండెంట్ డైరెక్టర్స్ డాక్టర్ రామచంద్రరెడ్డి, డాక్టర్. రమాశ్రీ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించండి

తిరుపతి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి) : నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం నగరంలోని గోవిందరాజస్వామి మాడ వీధులు, రైల్వే స్టేషన్, పీజీఆర్ థియేటర్ రోడ్డు, వీకే లేఔట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను ఆమె పరిశీలించారు. తడి, పొడి, ప్రమాదకర వ్యర్థాలను వేర్వేరుగా సేకరించాలన్నారు. మాడ వీధుల్లో దుకాణాల వద్ద ఏర్పాటు చేసిన చెత్త బుట్టలను పరిశీలించి అన్ని దుకాణాల వద్ద ఏర్పాటు చేయించాలని అన్నారు. కమిషనర్ వెంట శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి ఉన్నారు.



కొల్లు రవీంద్ర, అన్బుమణి రామదాస్ - జస్టిస్ బాలాజీ

తిరుమలలో ప్రముఖులు


తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధ, గురువారాల్లో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మంత్రి కొల్లు రవీంద్ర, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీబీ బాలాజీ, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, కేంద్ర మాజీ మంత్రి అన్బుమణి రామదాస్ ఉన్నారు.

తిరుమలలో పర్యావరణ ప్రణాళిక రూపొందించండి

● ఈవో శ్యామలరావు

తిరుమల, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో వృక్ష సంపద పెంపు, మానవులు-వన్యప్రాణుల సంఘర్షణ నివారణ చర్యలపై అటవీశాఖ అధికారులతో టీటీడీ ఈవో శ్యామలరావు గురువారం సమీక్ష నిర్వహించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జరిగిన సమీక్షలో జేఈవో వీరబ్రహ్మంతో టీటీడీ డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు పాల్గొన్నారు. గతేడాది తిరుమలలో చేపట్టిన వృక్షజాతుల పెంపకం, ఔషధ వనాల అభివృద్ధి, సుస్థిర అటవీ పునరుద్ధరణ చర్యలు వంటి వాటిపై డీఎఫ్‌వో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. 20 వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు తాండ్ర, రావి, ఉసిరి, వెలగ, జువ్వి, మర్రి, నేరేడు, అత్తి, ఎర్రచందనం వంటి 7 వేల మొక్కలు నాటినట్టు వివరించారు. వాటర్‌షెడ్, మట్టిస్థిరీకరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. వన్యప్రాణుల నిర్వహణలో భాగంగా అలిపిరి-తిరుమల మార్గాల్లో రెండువైపులా 60 కెమెరా ట్రాపులు, 31 సౌరశక్తితో నడిచే యాక్టివ్ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. శ్యామలరావు మాట్లాడుతూ..మరింత ఆధునిక నిఘా కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

సర్వదర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమ, మంగళవారాల హుండీ ఆదాయం: రూ.6.55 కోట్లు

మంగళ, బుధవారాల్లో శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 1,55,022

తలనీలాలు సమర్పించినవారు: 44,608

ఐదురోజుల్లో రిటైర్‌మెంటు
ఎస్‌ఈగా బదిలీ!

● విద్యుత్ శాఖలో చర్చనీయాంశం

చిత్తూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఐదురోజుల్లో రిటైరవుతున్న ఓ ఉన్నతాధికారి చిత్తూరుకు ఎస్‌ఈగా బదిలీపై రావడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశమైంది.ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో కమర్షియల్ విభాగ జీఎంగా వున్న నరేంద్రనాథ్ చిత్తూరుకు ఇన్‌చార్జి ఎస్‌ఈగా బదిలీపై వచ్చారు.ఇక్కడున్న ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ సెలవుపై వెళ్లగా ఆయన స్థానంలో నరేంద్రనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.చిత్తూరులో ఎస్‌ఈగా రిటైరవాలన్న ఆయన కోరిక నెరవేర్చడం కోసమే ఇక్కడున్న అధికారిని సెలవుపై పంపించారన్న విమర్శలు విన్పిస్తున్నాయి. కొన్ని నెలల క్రితం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు ఈఈ బభ్రువాహన్ మూడు రోజుల్లో రిటైర్ కానుండగా ఓ ఈఈని లీవ్‌పై పంపి చిత్తూరులో ఈఈగా బాధ్యతలు స్వీకరించి రిటైరయ్యారు.వైసీపీ ప్రభుత్వంలో డీఈగా ఉన్న ఓ అధికారి అప్పటి మంత్రి అండతో ఈఈగా పదోన్నతి పొందిన ఓ అధికారిని పక్కన పెట్టించి మరీ చిత్తూరు ఇన్‌చార్జ్ ఈఈగా బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్ల పాటు సీనియర్లపై అజమాయిషీ చేశారు.ఆయనకు మంత్రి అండ వుండడంతో ఎవరూ బహిరంగంగా నోరుమెదపలేకపోయారు.అప్పట్నుంచే విద్యుత్ శాఖలో ఈ సంస్కృతికి తెరలేచిందని ఉద్యోగులు వాపోతున్నారు

'ఇంటి గణపయ్య'ల నిమజ్జనం





తిరుపతిలోని ఇళ్లల్లో వినాయక ప్రతిమలతో 'చవితి' పూజలు నిర్వహించిన వారిలో చాలామంది బుధవారం సాయంత్రమే విగ్రహాలను నిమజ్జనం చేశారు. కుటుంబ సమేతంగా వినాయక సాగర్‌కు విగ్రహాలను తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. కొన్ని పెద్దవిగ్రహాలనూ తీసుకొచ్చారు. కాగా, మండపాల్లోని భారీ విగ్రహాలను ఐదో రోజైన ఆదివారం నిమజ్జనం చేయనున్నారు.

- తిరుపతి(జీవకోన), ఆంధ్రజ్యోతి

సమన్వయంతో ముందుకు సాగేలా..!

● నేటి దక్షిణాది రాష్ట్రాల పోలీసు సమావేశానికి ఏర్పాట్లు పూర్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగే లక్ష్యంతో దక్షిణాది రాష్ట్రాల డీజీపీలు, పోలీసు ఉన్నతాధికారుల సమావేశం జరగనుంది. తిరుపతిలోని గ్రాండ్ రిడ్జ్ హోటల్‌లో శుక్రవారం ఉదయం జరిగే సమావేశానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దాదాపు 65 మంది అధికారులు కూర్చోవడానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేయడానికి దాదాపు ఏడు కమిటీలను నియమించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలైన పాండిచ్చేరి, లక్షదీప్, అండమాన్ నికోబార్ నుంచీ పోలీసు ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. గురువారానికే నలుగురు డీజీపీలు సహా మొత్తం 56 మంది తిరుపతికి చేరుకున్నారు. వీరికి 14 మందికి హోటల్ తాజ్, 42 మందికి గ్రాండ్ రిడ్జ్‌లో వసతి ఏర్పాట్లు చేశారు. శాంతి భద్రతలు, ఉగ్రవాద నిర్మూలన, ఎర్రచందనం స్మగ్లింగ్, డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టడం, అంతర్రాష్ట్ర నేరస్థుల ముఠాలను పట్టుకోవడం, సైబర్ క్రైం, నూతన టెక్నాలజీ వినియోగం, సమాచార మార్పిడి వంటి అంశాలపై చర్చించనున్నారు. ప్రధానమైన పది అంశాలపై చర్చించి.. సంయుక్తంగా ముందుకెళ్లడానికి కార్యాచరణ రూపకల్పనకు చర్యలు చేపట్టనున్నారు.

పల్లెల వికాసానికి అగ్రాసనం

● పీఎంఏజీవై నిధులతో ఎస్సీ గ్రామాలకు ప్రగతిబాట ● రెండో విడత 53 గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన

● రూ.11.20కోట్లతో పనులతో పలు అభివృద్ధి పనులు ● గత పాలనలో ఈ పథకం నిధులు పక్కదారి



పెళ్లకూరు మండలం పునబాక ఎస్సీకాలనీలో పైపులైను వేస్తున్న దృశ్యం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పల్లెల ప్రగతికి కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తోంది.గతేడాది పల్లెలు చేపట్టింది మొదలు గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తూ వస్తోంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వ హయాంలో అధ్వానస్థితికి చేరిన రహదారుల్లో చాలాచోట్లకు రూపురేఖలు మార్చింది. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధుల కేటాయింపులోనూ ప్రత్యేక శ్రద్ధ కనబరిచింది. కేంద్రం ఇస్తున్న ప్రతిపైసాను వెచ్చిస్తూ చిత్తశుద్ధిని చాటుకుంటోంది. ఈక్రమంలోనే తాజాగా ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన(పీఎంఏజీవై)-2 కింద మంజూరైన నిధులతో ఎస్సీ పల్లెల వికాసానికి సంకల్పించింది.

చేపట్టాల్సిన పనులపై సర్వే: జిల్లాలో పీఎంఏజీవై పథకం రెండో విడతలో షెడ్యూల్‌కులాల జనాభా అధికంగా ఉన్న గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, భవనాలు, ఓవర్‌హెడ్‌ట్యాంకులు, మినరల్ వాటర్‌ప్లాంట్లు, శ్మశానవాటికల నిర్మాణంలతో పాటు జీవనోపాధి నైపుణ్యాభివృద్ధికీ ఈ నిధులు వెచ్చించనుంది. గ్రామానికి రూ.20లక్షలు చొప్పున మలివిడత ఎంపికైన 53 గ్రామాల్లో మంజూరైన రూ.11.20కోట్లతో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే అధికారులు సర్వే చేస్తున్నారు.

వైసీపీ హయాంలో నిధుల పక్కదారి : వైసీపీ హయాంలో పీఎంఏజీవై కింద మొదటి విడతలో 118 గ్రామాల అభివృద్ధికి కేంద్రం రూ.23.60కోట్ల మేర ఆర్థిక సాయం ప్రకటించింది. అందులో రూ.8కోట్లు రాగా నాటి పాలకులు అభివృద్ధికి ఖర్చు చేయకుండా పక్కదారి పట్టించారు. క్షేత్రస్థాయిలో పనులు జరగకుండా సుమారు రూ.2కోట్ల వరకు స్వాహా చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ బాధ్యతలు చేపట్టాక విడుదలైన మరో రూ.8కోట్ల విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకున్నారు. ఆయా గ్రామాల్లో యుద్ధ ప్రాతిపదికన మౌలిక వసతులు కల్పించేలా శ్రద్ధ వహించారు. రెండవ విడతలో ఎంపిక చేసిన గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ప్రణాళికలు రూపొందించినట్లు పీఎంఏజీవై జిల్లా కన్వీనర్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు.



వాకాడు మండలం బుడిగాలవాగులో సీసీరోడ్డు

గ్రామాల అభివృద్ధికి భరోసా

ఎస్సీ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పీఎంఏజీవై పథకం భరోసా లాంటిది. మొదటి విడతలో పెండింగ్‌లో ఉన్న నిధులు విడుదల చేసి చాలా వరకు పనులను పూర్తి చేశాం. రెండవ విడతలో 11.20కోట్లతో మారుమూల గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రతిపైసాను సద్వినియోగం చేస్తాం. పనుల్లో నాణ్యత లోపించినా, అవినీతి జరిగినా ఉపేక్షించేదిలేదు.

- వెంకటేశ్వర్, కలెక్టర్

అర్హులైన దివ్యాంగులకు న్యాయం

● కలెక్టర్ వెంకటేశ్వర్ భరోసా



కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పీడబ్ల్యూడీ నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పింఛను రీవెరిఫికేషన్‌లో ఇబ్బంది కలిగి ఉంటే సరిదిద్ది న్యాయం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ దివ్యాంగులకు భరోసా ఇచ్చారు. గురువారం కలెక్టరేట్‌లో దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ(పీడబ్ల్యూడీ)తోపాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులు వచ్చిన వారందరికీ అప్పీలు చేసుకోవడానికి అవకాశం కల్పించామన్నారు. సంబంధిత ఆస్పత్రుల్లో సదరం వెరిఫికేషన్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. అక్కడ ఇబ్బందులు పరిష్కరిస్తారన్నారు. అనర్హులకు పింఛను అందుతుందనే ఉద్దేశంతో పునఃపరిశీలన చేశామే తప్పా దివ్యాంగులపై ప్రభుత్వానికి ఎలాంటి కక్షా లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ శుభం బన్సల్, డీఎంహెచ్‌వో బాలకృష్ణ, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధా, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్ రామచంద్ర, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా విజేతలు విశాఖకు పయనం



తిరుపతి(క్రీడలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అమరావతి చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులు గురువారం విశాఖపట్నానికి బయలుదేరారు. జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం వీరికి సీఎం చంద్రబాబు క్రీడాకారులకు బహుమతులు, పతకాలు ప్రదానం చేయనున్నారు. ఈక్రమంలోనే ఆర్చరీ, బాక్సింగ్, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్ క్రీడాకారులు, కోచ్‌లు దాదాపు 50మంది తరలివెళ్లారు. వీరికి డీఎస్‌డీవో శశిధర్ వారికి అభినందనలు తెలియజేశారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగల అరెస్టు

● 15 ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్ల స్వాధీనం

రేణిగుంట ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ గుర్తింపు కార్డులు తయారు చేసుకుంటారు. ఐఐటీ, మెడికల్ కాలేజీల్లోకి దర్జాగా వెళతారు. ల్యాప్‌టాప్‌లను అపహరిస్తారు. ఇలా వివిధ రాష్ట్రాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను ఏర్పేడు పోలీసులు అరెస్టు చేశారు. ఇటీవల ఇక్కడి ఐఐటీలో ల్యాప్‌టాప్‌ల చోరీ నేపథ్యంలో కేసు నమోదు చేసిన పోలీసులు.. నిఘా పెట్టి నిందితులను పట్టుకున్నారు. ఈ వివరాలను రేణిగుంటలో గురువారం అదనపు ఎస్పీ రవి మనోహరాచారి మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన ప్రకారం.. ఏర్పేడు సమీపంలోని ఐఐటీలో ఇటీవల జరిగిన ల్యాప్‌టాప్‌ల దొంగతనాలపై డీఎస్పీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తిరువూరు జిల్లా పులివేలం గ్రామానికి చెందిన తమిళ్ సెల్వన్, కోయంబత్తూరు జిల్లాకు చెందిన వీరాస్వామి గణేషన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. వీరిద్దరూ ఐఐటీ, మెడికల్ కాలేజీలను టార్గెట్ చేసుకొని నకిలీ ఐడీ కార్డులతో విద్యార్థుల్లా లోపలకు ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. తమిళ్ సెల్వన్‌పై బెంగళూరు సిటీ, నాగపూర్, తిరుచ్చి, కేరళ, పాండిచ్చేరి, చెన్నై, రాజస్థాన్ రాష్ట్రాలలో 9 కేసుల్లో 500 ల్యాప్‌టాప్‌లు దొంగతనం చేసినట్లు ఇదివరకే కేసులు నమోదయినట్లు గుర్తించామని ఏఎస్పీ తెలిపారు. ఈ ఇద్దరి నుంచి రూ.8 లక్షల విలువచేసే 15 ల్యాప్‌టాప్‌లు, మూడు సెల్‌ఫోన్లు, ఒక పెన్ డ్రైవ్ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ ముఠాను పట్టుకుని విద్యార్థుల ల్యాప్‌టాప్‌లు రికవరీ చేసిన ఏర్పేడు పోలీసులను ఎస్పీ హర్షవర్ధన రాజు అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఏర్పేడు సీఐ శ్రీకాంత్ రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి, ఇమామ్ హుస్సేన్, సిబ్బంది వెంకటలక్ష్మి, రాజశేఖర్, బారుషా, మహేంద్ర బాలు, మణి, మునేంద్ర, కార్తీక్ పాల్గొన్నారు.



ల్యాప్‌టాప్‌లను చూపుతున్న ఏఎస్పీ తదితరులు

చంద్రగిరిలో రౌడీషీటర్ హత్య



చంద్రగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఓ రౌడీషీటర్ బుధవారం హత్యకు గురయ్యాడు. పోలీసుల కథనం మేరకు చంద్రగిరి పాతపేటలోని రాములవారి గుడి సమీపంలో అశోక్‌కుమార్‌రెడ్డి అలియాస్ కొండపల్లి రాజా ఇందిరమ్మ కాలనీకిచెందిన ఓ మహిళతో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. రౌడీషీట్ ఉన్న ఇతను కొద్దిరోజులుగా ఆమెను వేధిస్తున్నాడు. ఈక్రమంలో ఆమె బుధవారం ఉదయం తిరగబడి గొడవ చేసింది. ఆమె కుమారుడు అన్వర్‌బాషా చొరబడ్డాడు. గొడవ తీవ్ర రూపం దాల్చింది. ఘర్షణలో రాజాను కింద తోయడంతో రాయి మీద పడిపోయాడు తలకు బలమైన గాయమై మృతి చెందాడు. గాయపడిన అన్వర్ బాషాను స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేపట్టారు.

పోక్సో కేసులో యువకుడికి 26 ఏళ్ల జైలు

చిల్లకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తీపనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులుకు 26 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల మేరకు... 2021లో తీపనూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు అదే గ్రామానికి చెందిన బాలికను అపహరించి మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు సమీపంలోని ఓ పాడుపడిన ఇంట్లో అత్యాచారం చేశారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో శ్రీనివాసులుకు 26 ఏళ్ల జైలు శిక్ష, రూ.20వేల జరిమానా విధిస్తూ నెల్లూరు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

ఎస్వీ జూ పార్కుకు విదేశీ వన్యప్రాణుల రాక



తిరుపతి(మంగళం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ జూ పార్కులో కొత్తగా వివిధ దేశాలకు చెందిన వన్యప్రాణులు సందడి చేయనున్నాయి. గుజరాత్‌లోని రాధేకృష్ణ టెంపుల్ ఎలిఫెంట్ వెల్ఫేర్ ట్రస్టు సహకారంతో అక్కడ్నుంచి విదేశీ వన్యప్రాణులను తీసుకొచ్చామని జూ క్యూరేటర్ సెల్వం తెలిపారు. వీటిల్లో ఆస్ట్రేలియాలోని కంగారు జాతికి సమీప పోలికలున్న రెండు రెడ్ నెక్కుడు వాలాబిలను, దక్షిణాఫ్రికాలో జీవించే మీర్కాట్‌లు రెండు, బ్రెజిల్‌తోపాటుగా సమీప దేశాల్లో జీవించే రెండు మార్మోసెట్ వన్యప్రాణులను తీసుకొచ్చామని వివరించారు. వీటిని సంజీవని బ్లాక్‌లో క్వారంటైన్‌లో ఉంచి ఆరోగ్యం, అనుకూలతలను పర్యవేక్షిస్తున్నామన్నారు. క్వారంటైన్ కాలపరిమితి పూర్తయ్యాక సందర్శకుల కోసం ఎన్‌క్లోజర్లలో ఉంచతామన్నారు.



మార్మోసెట్ - రెడ్ నెక్కుడు వాలాబి

మరోసారి క్రీడా ప్రతిభ పాఠశాలగా 'పీఎం శ్రీ'



వడమాలపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్రీడల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపడంతో మరోసారి వడమాలపేటలోని పీఎం శ్రీ జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 'క్రీడా ప్రతిభ' అవార్డుకు ఎంపికైంది. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏటా ప్రతి జిల్లా నుంచీ విద్యా సంవత్సరంలో విద్యార్థుల క్రీడా ప్రతిభ ఆధారంగా ఐదు పాఠశాలలకు 'స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్' (క్రీడా ప్రతిభ) అవార్డులను ప్రదానం చేస్తుంది. 2024-25 విద్యా సంవత్సరానికి పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి 57 మంది క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో, ఒకరు జాతీయ స్థాయిలో పాల్గొని ప్రతిభ చూపారు. తద్వారా 222 పాయింట్లతో ఈ పాఠశాల మూడో స్థానాన్ని దక్కించుకుంది. గతంలో 2022-23 విద్యా సంవత్సరంలో 97 పాయింట్లతో ఐదో స్థానం, 2023- 24లో 178 పాయింట్లతో మూడో స్థానం సాధించింది. ఇలా వరుసగా మూడుసార్లు క్రీడా ప్రతిభకు ఎంపిక కావడం ఆనందంగా ఉందని పీడీ చంద్రశేఖర్ రాజు చెప్పారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల
పరిశీలన ప్రారంభం

గైర్హాజరైన అభ్యర్థులకు నేడు అవకాశం

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ మెరిట్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన గురువారం చిత్తూరులోని రెండు ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రారంభమైంది. మురకంబట్టులోని అపోలో విశ్వవిద్యాలయంలో డీఈవో వరలక్ష్మి, తిరుపతి రోడ్డులోని ముత్తిరేవుల సమీపంలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎస్వీసెట్)లో తిరుపతి డీఈవో కేవీఎన్ కుమార్‌లు లైన్ డిపార్టుమెంట్ అధికారులతో కలిసి పరిశీలన ప్రక్రియను పర్యవేక్షించారు. ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమైన ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,478 పోస్టులు భర్తీ చేయనుండగా, తొలిరోజైన 1,200 మంది అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు రాష్ట్ర విద్యాశాఖ అనుమతిస్తూ.. అభ్యర్థుల వ్యక్తిగత మొబైల్స్‌కు సమాచారం పంపింది. ఒక్కో కేంద్రంలో 15 బృందాల చొప్పున 110 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో పాల్గొన్నారు. పరిశీలన కేంద్రంలోకి అభ్యర్థితోపాటు వారి తల్లిదండ్రులను మాత్రమే అనుమతించారు. ప్రతి సమస్యను చిత్తూరు, తిరుపతి డీఈవోలు పరిష్కరించడంతోపాటు దివ్యాంగుల కేటగిరీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దివ్యాంగులైన అభ్యర్థులను తదుపరి పరీక్షల నిమిత్తం నిర్దేశించిన రెఫరల్ ఆస్పత్రులకు పంపారు. మెరిట్ సాధించి, కాల్ లెటర్ పొంది.. ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు గైర్హాజరైన వారికి విద్యాశాఖ మరో అవకాశం కల్పించింది. వీరితోపాటు మెరిట్ జాబితాలోని మిగిలిన 278 మంది ధ్రువీకరణ పత్రాల పరిశీలన శుక్రవారం కొనసాగనుంది. రెవెన్యూ, డీఆర్‌డీఏ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, మెడికల్, పోలీసు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గతంలోకంటే మెరుగైన రహదారులు : అమెరికా మంత్రి కితాబు

తిరుపతి(రవాణా), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గతంలో కంటే రహదారుల నిర్మాణం మెరుగ్గా ఉందని అమెరికా మంత్రి లంఎకల బద్రీనాథ్ కితాబిచ్చారు. అమెరికాలో మంత్రిగా ఉంటూ ఆయన స్వగ్రామం చంద్రగిరికి వచ్చారు. ట్రాన్స్‌పోర్టు ఇంజనీరింగ్ విభాగంలో స్పెషలైజేషన్ చేసిన ఆయన రవాణాశాఖ విధి విధానాల గురించి తెలుసుకోవడానికి గురువారం ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. తిరుపతి జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ ఘనంగా సన్మానించారు. రవాణా శాఖలో అవలంబిస్తున్న విధివిధానాలపై చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, అతికానాజ్, ఏవోలు విజయకుమార్, విజయ ప్రశాంతి పాల్గొన్నారు.



అమెరికా మంత్రి బద్రీనాథ్‌ను సన్మానిస్తున్న డీటీవో మురళీమోహన్

నోటీసులు అందుకున్న వారికి
యథావిధిగా పింఛను

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పింఛను పునఃపరిశీలనలో భాగంగా నోటీసులు అందుకుని అధికారులకు అప్పీలు చేసుకున్న దివ్యాంగులకు సెప్టెంబరు 1న యథావిధిగా పింఛను అందించనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం రాత్రి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గురువారం వరకు 3,073మంది దివ్యాంగులు అప్పీలు చేసుకున్నారని వారందరికి పింఛన్లు పంపిణీ చేస్తామన్నారు.

జనవరిలో పద్మావతి వర్సిటీ 22వ స్నాతకోత్సవం

● దరఖాస్తులకు నోటిఫికేషన్ జారీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవాన్ని జనవరిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇన్‌పర్సన్ పద్ధతిలో స్నాతకోత్సవంలో పట్టాలు స్వీకరించడానికి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకోసం అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. సమగ్ర సమాచారం కోసం ఎస్‌పీఎంవీవీ.ఏసీ.ఇన్.. వెబ్‌సైట్ చూడవచ్చునని వర్సిటీ పీఆర్వో డాక్టర్ శ్రీరజని ఒక ప్రకటనలో తెలిపారు.

పుత్తూరు వార్తలు

చవితి వేడుకలలో ఎమ్మెల్యే భానుప్రకాష్



పుత్తూరు టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణంలోని ప్రతి వీధిలో వినాయకచవితిని ఘనంగా నిర్వహించారు. కాపువీధిలోని శయన గణపతి, గేటు పుత్తూరులోని భారీ వినాయక మండపాలలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బెస్త వీధిలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ డీఎస్ గణేష్, పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు జీవరత్నంనాయుడు, ధనపాల్, విక్కీరాయల్, శివాలయ కమిటీ సభ్యులు పార్తీబన్, యుగంధర్ పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి



పుత్తూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ కు స్మార్ట్ మీటర్ల ఏర్పాటును రద్దు చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల పెంపు వ్యతిరేక ఆందోళనలో బషీర్‌బాగ్ వద్ద అమరులైన కామ్రేడ్ రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామికి గురువారం స్థానిక అంబేద్కర్ సర్కిల్ వద్ద నివాళులు అర్పించారు. సీపీఎం నాయకుల శివరామూర్తి, రమేష్, హరీష్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

వడమాలపేట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్వీఆర్ పురం వెళ్లేదారిలో గూళూరు చెరువులోకి ఓ కారు అదుపుతప్పి దూసుకెళ్లింది. ఎస్వీఆర్ పురానికి చెందిన నవీన్ కారులో గ్రామం నుంచి తిరుపతికి వెళ్తూ ఎదురుగా వస్తున్న ఆవును తప్పించబోయి అదుపు తప్పి చెరువు అంచుకు కారు దిగబడింది. స్థానికులు కారును లాగేశారు. అతడు సురక్షితంగా బయటపడ్డారు.

పాలిటెక్నిక్ కళాశాలకు కంప్యూటర్ల వితరణ



వితరణ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ఇమామీ

పుత్తూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడానికి తమ సంస్థ మరిన్ని కార్యక్రమాలను చేపడుతుందని ఐమాస్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామీ అన్నారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో ఐమాస్ సంస్థ పుత్తూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు గురువారం 7.5లక్షలు విలువ చేసే 15 కంప్యూటర్లను వితరణ చేసింది. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ గత అయిదేళ్లలో పలు విద్యా సంస్థలకు దాదాపు 1.8 కోట్ల రూపాయలను వ్యయం చేశామని వివరించారు. ప్రిన్సిపాల్ కుమార్ మాట్లాడుతూ ఈ కంప్యూటర్ల వితరణ వల్ల సివిల్, మెకానికల్ విభాగంలోని 300 మంది విద్యార్థులకు ఉపయోగకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థకు చెందిన హరిహరన్, రాజీవ్, సుప్రియ, శ్రీసిటీ ఫౌండేషన్ ప్రతినిధి సురేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

గిరి బలిజ ఉత్తర్వులను రద్దు చేయాలి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న బలిజ సేన నాయకులు

వడమాలపేట,ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన గిరి బలిజ జీఓ 1793 ను వెంటనే రద్దుచేయాలని బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా బలిజ సేన నాయకులు గోపిరాయల్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. డీటీ రూప్‌చంద్‌కు వివతిపత్రం అందజేశారు. ఈ నిరసనలో బలిజ సేన నాయకులు కుమార్, శివరాయల్, అంజెయ్య, మునెయ్య పాల్గొన్నారు.

స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు



దాసుకుప్పం పీహెచ్‌సీలో స్విమ్స్ బృందం

సత్యవేడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని దాసుకుప్పం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో గురువారం తిరుపతి స్విమ్స్ కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కే.నాగరాజ్ ఆధ్వర్యంలో ఉచిత మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. నోడల్ అధికారులు డాక్టర్ టీవీడీ ప్రత్యూష, డాక్టర్ ఎం.లలిత, డాక్టర్ హరిత, సర్పంచ్ రవిరెడ్డి. ఎంపీహెచ్‌ఈవో సుబ్ర మణ్యం, సూపర్‌వైజర్ ఎం.మురళి, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చెరువులో పడి గుర్తుతెలియని యువకుడి మృతి

రేణిగుంట, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చెరువులో గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని కొందరు గుర్తించారు. ఈసంఘటన గురువారం రాత్రి వెంకటాపురంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కరకంబాడి -తిరుపతి రోడ్డు మార్గంలోని వెంకటాపురం చెరువులో బుధవారం రాత్రి దుర్వాసన వెదజల్లడంతో కొంతమంది యువకులు పరిశీలించేందుకు వెళ్లగా నీటిపై శవం తేలాడుతుండడాన్ని గుర్తించారు. మంగళానికి చెందిన కొంతమంది యువకులు భారీ వినాయకుడిని తీసుకువచ్చి నిమజ్జనం చేశారని, ఆ సమయంలో ఎవరైనా యువకుడు ప్రమాదవశాత్తు పడి మృతి చెంది ఉంటారని అనుమానిస్తున్నారు పెట్రోలింగ్ పోలీసులు స్థానికుల సాకారంతో చెరువులోని మృతదేహాన్ని వెలికి తీశారు. రేణిగుంట అర్బన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రెండు లారీల ఢీ

తడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి - చెన్నై మార్గంలో బోడిలింగాలపాడు వద్ద బుధవారం సాయంత్రం రెండు లారీలు ఢీకొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి చెన్నై వైపు వెళ్తున్న లారీ బోడిలింగాలపాడు వద్ద మలుపు తిరుగుతుండగా నెల్లూరు వైపు వెళ్తున్న మరో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రెండు లారీలు కొంతమేర దెబ్బ తిన్నాయి. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. చెన్నై - నెల్లూరు రహదారిపై భారీగా వాహనాలు నిలిచిపోయాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండు మోటారు సైకిళ్ల ఢీ
ఇద్దరికి తీవ్రగాయాలు

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో రెండు మోటారు సైకిళ్లు ఢీకొన్న సంఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణానికి చెందిన సాయితేజ, రమేష్ మోటారు సైకిళ్లపై వెళ్తూ ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సాయితేజ, రమేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం సాయితేజను నెల్లూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వర్ణముఖినదిలో వృద్ధురాలి మృతదేహం

పెళ్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకూరు స్వర్ణముఖినదిలో ఓ వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. ఎస్ఐ నాగరాజు వివరాల మేరకు... శ్రీకాళహస్తి పట్టణం ఎస్‌డీకే నగర్‌కు చెందిన నాగ్రా ఆదెమ్మ (75) ఇంటి నుంచి వెళ్లిపోయింది. గురువారం ఉదయం కలవకూరు వద్ద స్వర్ణముఖినదిలో స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

పెళ్లకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నేపల్లి జాతీయ రహదారిపై గురువారం కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. పెళ్లకూరులోని చెన్నకేశవస్వామి దేవాలయానికి చెందిన భూముల వేలం పాటకు దేవదాయశాఖ ఈవో హరికృష్ణ వచ్చారు. వేలంపాట వాయిదా పడటంతో ఈవో తిరుగు ప్రయాణమయ్యారు. ఆయన వెళ్తున్న కారు పెన్నేపల్లి వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. కారు దెబ్బతినగా, రవికృష్ణకు ఎలాంటి గాయాలు కాలేదు.

బ్యారేజీ నిర్మించండి

నాయుడుపేట టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినది వద్ద బ్యారేజీని నిర్మించాలని కోరుతూ విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి వినతిపత్రం అందజేశారు. విశ్రాంత రెవెన్యూ ఉద్యోగి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





గుడూరు పట్టణం వీరారెడ్డిపల్లిలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్ - నాయుడుపేట దర్గావీధిలోని గణనాథుని సన్నిధిలో ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు

భక్తిశ్రద్ధలతో చవితి వేడుకలు

వాడవాడలా వినాయక విగ్రహాల ప్రతిష్ఠ

సూళ్లూరుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మూషిక వాహనా పాహిమాం.. పార్వతీ తనయా పాహిమాం.. అంటూ ప్రజలు విఘ్ననాథుడిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. ఘుమఘుమలాడే వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. సుగంధ సుమాలు.. పండ్లు.. పుష్పాలు.. పత్రితో పూజించి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే విధంగా మట్టి విగ్రహాలతో లంబోదరుడిని సేవించుకున్నారు. ఇంటింటా వినాయక వ్రతం ఆచరించి పునీతులయ్యారు. పట్టణంతో పాటు గ్రామాల్లో యువత మండపాలు ఏర్పాటు చేసి భారీ విగ్రహాలతో సందడి చేశారు. పలుచోట్ల వేడుకగా ఉట్లోత్సవం నిర్వహించారు. అన్నదానం చేశారు. సూళ్లూరుపేట పట్టణంలోని షార్ బస్టాండు వద్ద పెద్ద గణేశ్ విగ్రహం ఏర్పాటు చేసి ప్రత్యే పూజలు చేశారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, శ్రీసిటీ ఎండీ సన్నారెడ్డి రవీంద్ర రెడ్డి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. అంతకుముందు మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, నాగేశ్వరస్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ తాటిపర్తి ఆది నారాయణరెడ్డి చేతుల మీదుగా వినాయక విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ చేశారు. అలాగే వీర్లచావడి వద్ద మంచు పర్వతాల మీద వినాయకుడు కొలువు దీరినట్లు గణపయ్యను ఏర్పాటు చేశారు. గాండ్లవీధిలో అన్న క్యాంటీన్ వద్ద భారీ విగ్రహాన్ని నెలకొల్పి పూజలు చేశారు. గాండ్లవీధి, కోళ్లమిట్టలో గురువారం భక్తులకు అన్నదానం చేశారు. కాళంగి నదిలో నిమజ్జనానికి మున్సిపాలిటీ అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గూడూరు: పట్టణంలో వాడవాడలా వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణంలోని ముత్యాల పేట, రాణీపేట, తూర్పువీధి, మాళవ్యానగర్, వీరారెడ్డిపల్లి, ఎస్ఆర్ఏ సెంటర్, అశోక్‌నగర్, అరుంధతీయపాళెం, నాయుడు కాలువకట్ట, నలజాలమ్మవీధి, కోనేటిమిట్ట తదితర ప్రాంతాల్లో కూడళ్ల వద్ద వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు జరిపారు. పలు ప్రాంతాల్లో అన్నప్రసాద వితరణ చేపట్టారు. వీరారెడ్డిపల్లి కూడలిలో వినాయక ప్రతిమ వద్ద జరిగిన పూజల్లో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొన్నారు. ఇందిరానగర్‌లోని మోదగవనం వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి పల్లకీసేవ జరిపారు. తూర్పువీధిలోని వినాయకస్వామి ఆలయం వద్ద స్వామివారిని చందనంతో అలంకరించారు. ట్రాక్టర్‌పై ఉంచి గ్రామోత్సవం జరిపారు.




కోట విద్యానగర్‌లో ఉట్టి కొడుతున్న యువకులు

కోట: మండలంలో వినాయక చవితి ఉత్సవాలు వేడుకగా జరిగాయి. విద్యానగర్, ప్రకాశంకాలనీ, కోట క్రాస్‌రోడ్డులో యువత ఉట్టి కొట్టారు. పలుచోట్ల అన్నదానం జరిగింది. మండలంలోని శ్రీనివాసనత్రం బీచ్‌లో గణేష్ విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ఓజిలి: మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయకు చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఓజిలిలోని వినాయక దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రతిమ వద్ద టీడీపీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు పాడి వెంకటసుబ్బయ్య, దంపతులతో పాటు కాటూరు కోటేశ్వరరావు పూజలు నిర్వహించారు. అదే విధంగా పున్నేపల్లిలో టీడీపీ కన్వీనరు విజయకుమార్ నాయుడు, అత్తివరంలో కనుమూరు గోపాల్‌రెడ్డి వినాయక చవితి పూజల్లో పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట పట్టణంతో పాంతో మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాలను వేడుకగా జరిగాయి. పట్టణంలోని దర్గావీధిలో ఏర్పాటు చేసిన 23 అడుగుల భారీ గణనాథుడిని ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారథి దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, టీడీపీ నాయకుడు పొట్లపూడి రాజేష్ ఎమ్మెల్యే దంపతులకు స్వాగతం పలికారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పట్టణంలోని వెలంపాళెంలో వినాయక ఉత్సవాల్లో ఎమ్మెల్యే రామకృష్ణ

వెంకటగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్యక్రమాలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం రాత్రి పట్టణంలోని తూర్పువీధి, శివాలయం వీధి, అంజనేస్వామి సెంటర్, వెలంపాళెం సెంటర్లలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికత, దైవచింతన అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, లాలాపేట సొసైటీ అధ్యక్షుడు గొల్లగుంట వెంకటముని, వెంకటగిరి సీఐ రమణ, ఎస్ఐ ఏడుకొండలు, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, వెంకటగిరి మండల టీడీపీ అధ్యక్షుడు మురళీ గౌడ్, మంకు ఆనంద్, జనసేన నాయకులు తోట కృష్ణయ్య, అనిల్ రామారావు, పరుచూరి నరసయ్య, పునుగోటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తూపిలిపాళెం తీరంలో నిమజ్జనానికి పటిష్ఠ ఏర్పాట్లు



మీడియాతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ గీతాకుమారి

వాకాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జన ప్రక్రియలో ఎలాంటి అపశృతులు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా అన్నారు. మండలంలోని తూపిలిపాళెం సముద్రతీరంలో గురువారం డీఎస్పీ గీతాకుమారితో కలిసి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ విగ్రహాలు ఎలాంటి అవాంతరాలు లేకుండా తీరానికి తరలిపోయేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మరో ఐదు రోజులపాటు వినాయక ప్రతిమలు వేలల్లో రానున్న నేపథ్యంలో కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సముద్రతీరంలో ఇప్పటికే రెండు బోట్‌లు అందుబాటులో ఉంచామని, మరో ఐదు బోట్‌లు, క్రేన్ సిద్ధం చేస్తామన్నారు. అలాగే తీరంలో లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు నిర్ణయించిన నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనానికి వినాయక ప్రతిమలను తీసుకురావాలని సబ్ కలెక్టర్ భక్తులకు సూచించారు. కార్యక్రమంలో సీఐ హుస్సేన్‌బాషా, మెరైన్ అధికారులు, ఆర్ఐ అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

గూడూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో గురువారం పెళ్లకూరు చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. తిరుపతి వెంకటేశ్వర అరవింద నేత్రాలయ సహకారంతో పేదలకు కంటి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలను అందజేశారు. అవసరమైన వారికి ఉచితంగా శస్త్రచికిత్సలు చేయిస్తామని నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో సీతారామనాయుడు, గౌరీశంకర్, కృష్ణ, జీవన్, డాక్టర్లు జయంత్‌రెడ్డి, సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

31న జిల్లా టెన్నికాయిట్ జట్ల ఎంపిక

గూడూరు అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం టెన్నికాయిట్ సీనియర్, జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ తెలిపారు. విద్యార్థులు పుట్టిన తేదీ ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు.

క్వాంటం టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలి

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): క్వాంటం టెక్నాలజీపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని పద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ ఉమ పేర్కొన్నారు. అమరావతి క్వాంటం వ్యాలీ హాకథాన్-2025లో భాగంగా పద్మావతి వర్సిటీలో గురువారం ఇంటర్నల్ హాకథాన్ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ క్వాంటం టెక్నాలజీకి ప్రస్తుతం ప్రాముఖ్యత ఏర్పడిందని, దీనిపై అవగాహన ఉన్న వారికి ఉన్నత ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ఎన్.రజని మాట్లాడుతూ టెక్నాలజీలోనూ సృజనాత్మకతను ప్రదర్శించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నిపుణులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వసతి గృహంలో చోరీకి యత్నం

తిరుపతి(వైద్యం), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎస్వీ వైద్య కళాశాల ఆవరణలోని వైద్య విద్యార్థుల వసతిగృహంలో గుర్తు తెలియని వ్యక్తి గురువారం రాత్రి చోరీకి ప్రయత్నించాడు. విద్యార్థులు, సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై అతన్ని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చేలోపు తప్పించుకుని పారిపోయాడు. సెక్యూరిటీ మేనేజరు శంకర్ ఘటనపై ఆరా తీశారు. అపరిచిత వ్యక్తులు కళాశాల, ఆస్పత్రి పరిసరాల్లో కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు.

క్రీడా పరికరాలు, కుర్చీల వితరణ



క్రీడా పరికరాలను అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

చిల్లకూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో క్రీడాపరికాలు, కుర్చీలను వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రగతి సేవాసంస్థ తమ పాఠశాలకు క్రీడా పరికరాలు, కుర్చీలను అందజేయడం సంతోషకరమన్నారు. అనంతరం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, జీ.చంద్రశేఖర్, సంస్థ సభ్యులు శ్రీనివాసులు, మురళీనాయుడు, రామ్మోహన్‌రావు, రవి, వెంకటేశ్వరరావు, శ్రీహరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక దండోరా కాలనీకి చెందిన భావన ప్రమాదంలో గాయపడి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ దాతృత్వంతో టీడీపీ నాయకులు రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని భావన కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పెంచలయ్య, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి వర్సిటీ విద్యార్థినులకు ఆత్మరక్షణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీలో విద్యార్థినులకు ఆత్మరక్షణపై శిక్షణ అందించారు. ఎన్ఎస్ఎస్, స్టూడెంట్ అఫైర్స్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశాయి. స్టూడెంట్ అఫైర్స్ డీన్ ఉషారాణి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ స్థితిలో తమను తాము కాపాడుకోవడానికి స్వీయ రక్షణ విద్య అవసరమన్నారు. దీనివల్ల ఆత్మవిశ్వాసం, ధైర్యం, చురుకుదనం పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నీరజ, కరాటే నిపుణులు రత్నాకర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం దారుణం: కురుగొండ్ల

వెంకటగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కైవల్యా నది పూడిక తీత పనులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కైవల్యా నదిని అభివృద్ధి చేసేందుకు టీవీఎస్ సంస్థ ముందుకురావడం అభినందనీయమన్నారు. ముళ్ల చెట్లు పెరిగిపోయి నది పూర్తిగా పూడిపోవడంతో ఇరువైపులా ఉన్న నివాస గృహాలు ముంపునకు గురౌతున్నాయని, ఈ సమస్యను గుర్తించిన టీవీఎస్ సంస్థ 50 శాతం నిధులు ఖర్చు చేసేందుకు ముందుకు వచ్చిందన్నారు. మిగిలిన 50 శాతం నిధులు మున్సిపాలిటి భరించేలా తీర్మానం ప్రవేశపెడితే కొంతమంది కౌన్సిలర్లు ఆమోదించకపోవడం దారుణమన్నారు. ఇలాంటి కౌన్సిలర్లను గెలిపించినందుకు పట్టణ ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. నదిని అభివృద్ధి చేస్తే తమకేం లాభమన్న స్వార్థంతో ఆలోచించే కౌన్సిలర్లకు ప్రజలే బుద్ధి చెప్పాలన్నారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా వెంకటగిరి అభివృద్ధి ఆగదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి, ఎంపీపీ తనూజారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, తిరుపతి పార్లమెంటు టీడీపీ కార్యదర్శి పులికొల్లు రాజేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, వెంకటగిరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు అవ్వారు సత్యనారాయణ, మండల అధ్యక్షుడు మురళీ గౌడ్, శివారెడ్డి, లింగసముద్రం సొసైటీ అధ్యక్షుడు రంగినేన రాజా, బ్లయిండ్స్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి నరసయ్య, తెలుగు యువత పట్టణ కార్యదర్శి టీవీ రత్నం, 13వార్డు ఇన్‌చార్జి కౌశ్యలమ్మ పాల్గొన్నారు.

పెండింగ్ పనులకు నిధులు కేటాయించండి
సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే వినతి

తడ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులకు నిధులు కేటాయించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. గురువారం అమరావతి సచివాలయంలో చంద్రబాబును కలిశారు. కాళంగి, స్వర్ణముఖి నదులపై సూళ్లూరుపేట, నాయుడుపేట వద్ద ప్రస్తుతం ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని పునఃనిర్మించాల్సి ఉందన్నారు. అలాగే కాళంగి నదిలో చెక్‌డ్యామ్‌లను నిర్మిస్తే రైతాంగానికే కాకుండా సూళ్లూరుపేట పట్టణ తాగునీటికి ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యేతో పాటు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఓజిలి, పెళ్లకూరు మండలాల టీడీపీ అధ్యక్షులు విజయకుమార్ నాయుడు, సంచి కృష్ణయ్య, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కనుమూరు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతం

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సునీత సేవాసంస్థ వారికోత్సవం సందర్భంగా గురువారం ఆ సంస్థ కార్యాలయంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. డాక్టర్లు పావని, ఉషారాణి మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి



వేలు (ఫైల్‌ఫొటో)

నాగలాపురం, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ఘటన నాగలాపురం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ సునీల్ పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన ముట్టదొరై కుమారుడు వేలు(42) పిచ్చాటూరులోని ఓ హోటల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తు న్నాడు. పని పూర్తిచేసుకుని బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంలో ఇంటికి బయలు దేరాడు. మార్గమధ్యంలో నాగలాపురంలో చెల్లియమ్మన్ ఆలయ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందిం చారు. పోలీసులు అతడి మృతదేహాన్ని సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలిం చారు. మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులతో దురుసు ప్రవర్తన
ఏడుగురిపై కేసు నమోదు

వరదయ్యపాళెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గస్తీ తిరుగుతున్న పోలీస్ సిబ్బందిపై మద్యం మత్తులో దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున కథనం మేరకు.. బుధవారం రాత్రి ట్రైనింగ్ ఎస్ఐ రామాంజనేయులు, పోలీస్ కానిస్టేబుల్ బుజ్జిబాబు పట్టణంలోని చెంగాళమ్మ ఆలయం సమీపంలో గస్తీ చేపట్టారు. ఓ చికెన్ దుకాణం వద్ద మద్యం మత్తులో కొందరు యువకులు గుంపుగా ఉండడంతో పోలీసులు వారిని అక్కడనుంచి వెళ్లిపోవాలని సూచించారు. మద్యంమత్తులో ఉన్న యువకులు పోలీసులపై తిరగబడ్డారు. పరుష పదజాలంతో దూషణకు దిగారు. కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన అశోక్, రాజేష్, ఉదయ్, మునిరాజా, చిన్నిరాజా, ముత్తు, గోవర్ధనపురానికి చెందిన శరత్‌రెడ్డిలపై కేసు నమోదు చేశారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

మహారాష్ట్ర గవర్నర్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌కు సాదర వీడ్కోలు లభించింది. జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని గురువారం ఉదయం తిరుగు ప్రయాణంలో తిరుపతి విమానాశ్రయం చేరుకున్న ఆయనకు మంత్రి నారాయణ, తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలాఆనంద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ తదితరులు వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన ఇండిగో విమానంలో ముంబయికి బయలుదేరి వెళ్లారు.

వాడవాడలా గణేశుడికి నైవేద్యాలు



శంకు వినాయకుడి సేవలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండల వ్యాప్తంగా వినాయక చవితి సందడి నెలకొంది. గురువారం పట్టణంలోని రైల్వే స్టేషన్ వద్ద వరసిద్ధి వినాయక కమిటీ, బుగ్గ వీధిలో విఘ్నేశ్వర నిమజ్జన కమిటీ ఏర్పాటు చేసిన శంకు వినాయకుడు, గరుడ నటరాజ వినాయకుడిని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం దర్శించుకున్నారు. శుక్రవారం మూడో రోజు కావడంతో వినాయక నిమజ్జనానికి పోలీస్ శాఖ ముందస్తు భద్రతా చర్యలను చేపట్టారు. టైం స్లాట్లను కేటాయించారు.

అదానీ స్మార్ట్ మీటర్లను అడ్డుకుందాం

శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ విద్యుత్ అమరవీరుల త్యాగాల సాక్షిగా ఆదానీ స్మార్ట్ మీటర్లను అడ్డుకుంటామని వామపక్షనాయకులు, ప్రజా సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న అంబేడ్కర్ సర్కిల్ వద్ద గురువారం వారు విద్యుత్ మీటర్లు, ఛార్జీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ బషీర్‌బాగ్ ఘటనకు పాతికేళ్లయిందన్నారు. ప్రజలపై అదానీ స్మార్ట్‌మీటర్లు, అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని రుద్దడం మానకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదన్నారు. ఈ కార్యక్రమం సీపీఐ ప్రాంతీయ కార్యదర్శి జనమాల గురవయ్య, సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి, వామపక్ష నాయకులు గురవయ్య, సంక్రాంతి వెంటక్య, వెంకటేష్, అన్వర్ బాషా, మించల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానాలు

ఏర్పేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలో బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వీధివీధినా, వాడవాడలా పల్లెపల్లెనా వినాయకస్వామి విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అన్నదానాలు చేశారు. భజనలు చేశారు. మోదుగులపాళెంలో జరిగిన వినాయక చవితి వేడుకల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బండారుపల్లిలో జరిగిన వినాయక చవితి వేడుకల్లోనూ ఆయన స్వామివారికి పూజలు చేశారు.

కండక్టర్ కుమార్తెకు ఎంబీబీఎస్ సీటు



జస్విత రెడ్డి

పిచ్చాటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు టీచర్స్ కాలనీలో నివాసం ఉంటున్న లోకనాథం, రాధిక దంపతుల కుమార్తె జస్విత రెడ్డికి తిరుపతి ఎస్వీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు లభించింది. ఈమెకు 521 మార్కులు రాగా ఆలిండియా ర్యాంకు 30920, స్టేట్ ర్యాంకు 823 వచ్చింది. ఈమె 6 నుంచి 10వ తరగతి వరకు జవహర్ నవోదయ విద్యాలయ వలసపల్లి మదనపల్లిలో విద్యాభ్యాసం చేసింది. ఇంటర్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ తిరుపతిలో చదివింది. ఈమె తండ్రి సత్యవేడు డిపోలో ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తున్నాడు. తల్లి నాగలాపురం మండలం కడివేడు పంచాయతీ సెక్రటరీగా పనిచేస్తున్నారు.

పిల్లల సహజ గుణాలకు సానపట్టాలి



మాట్లాడుతున్న ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి

ఏర్పేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పిల్లల సహజ గుణాలకు సాన పట్టాలని ప్రముఖ సైకలాజిస్టు డాక్టర్ ఎన్‌బీ సుధాకర్‌రెడ్డి సూచించారు. ఏర్పేడు మండలం ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో గ్రామీణ మహిళల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఇతరులను అనుసరించి పిల్లలపై ఒత్తిడి పెంచడం మంచిది కాదన్నారు. మహాభారతంలో ద్రోణుడు కౌరవులు, పాండవుల బాల్యంలో వారి గుణాలు, సామర్థ్యం, నైపుణ్యాలను అనుసరించే శిక్షణ ఇచ్చారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుంచే నైతిక విలువలను నేర్పిస్తే సమాజంలో అవినీతి తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోఎస్ కుటుంబ బలోపేత కార్యక్రమ ఇన్‌చార్జి సత్యనారాయణ, సహోద్యోగులు మునిరత్నం, వెంకటరమణ, యాని మేటర్లు, అక్కుర్తి, పల్లం, ఉడమలపాడు గ్రామాల నుంచి 80మంది మహిళలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

పుత్తూరు అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికట్టాలని న్యాయవాదుల సంఘం అధ్యక్షులు గాలి సురేష్‌బాబు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని శేషసాయి పాఠశాల లో బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎవరైన చేస్తుంటే వెంటనే 100 డయల్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనంతరం బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది దిలీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువైన మేథో గురుదక్షిణామూర్తికి గురువారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అభిషేకానంతరం స్వామివారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

తడి - పొడిచెత్తపై అవగాహన కల్పించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో తడి - పొడిచెత్తలపై మహిళా సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో వెంకటరత్నమ్మ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీర్డీ చిరంజీవి, ఏపీఎం మునెయ్యలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని పది ఎంపీటీసీ పరిధిలో మహిళ సభ్యులను బృందాలుగా ఏర్పాటు చేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. వెలుగు కార్యాలయ అకౌంటెంట్ గిరిజ పాల్గొన్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు

నారాయణవనం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నారాయణవనం లో కొలువైన మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయ పవిత్రోత్సవాలను శుక్రవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

అమరవీరులకు నివాళి

నారాయణవనం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హైదారాబాదులో విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ అసువులుబాసిన అమర వీరులకు సీపీఎం మండల నాయకులు మునిశంకర్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. గురువారం పాలమంగళంలో అమరులైన వారికి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆకస్మిక మృతి

శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి పురపాలక సంఘ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న బాలకృష్ణ గురువారం ఆకస్మికంగా మృతి చెందాడు. చంద్రగిరిలోని స్వగృహంలో ఉదయం స్పృహ కోల్పోవడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘ సిబ్బంది ఆయన మృతికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదు

కేవీబీపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సీఐ రవి కోరారు. గురువారం మండలంలోని పెరిందేశం, రాగిగుంట గ్రామాల్లోని ప్రజలకు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణపై కేవీబీపురం పోలీసు స్టేషన్‌లో అవగాహన కల్పించారు. గత ఏడాది వినాయక చవితి పండుగ సందర్భంగా జరిగిన గొడవల్లో కేసులు ఇప్పటికీ ఉన్నాయన్నారు. అలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హెచ్చరించారు. గంజాయి, సారా విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేష్, ప్రొపెషనల్ ఎస్ఐ ఇమాన్యుయేల్, పోలీసుసిబ్బంది.

సజ్జ పంటలో క్షేత్ర దినోత్సవం

కేవీబీపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిగుంట గ్రామంలో తిరుపతి రాస్ కేవీకే జాతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ వారి ఆధ్వర్యంలో సజ్జ పంట క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందులో కేవీకే శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ యేడాది కేవీకే సంస్థ అందించిన ఏబీబీ04 సజ్జ రకం పంట రైతులకు అత్యధిక దిగుబడి నిస్తుందని చెప్పారు. కనీసం హెక్టారుకు 20 నుంచి 25 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు దివ్య, రైతులు పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ మృతులకు ఘన నివాళి

ఏర్పేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బషీర్‌బాగ్ కాల్పులు జరిగి నేటికి 25ఏళ్లు అయిందని ఏర్పేడు సీపీఐ మండల కార్యదర్శి సర్దార్ శివకుమార్ తెలియజేశారు. ఏఐటీయూసీ వికృతమాల కార్యాలయం వద్ద ప్లకార్డులతో బషీర్‌బాగ్ అమరవీరులకు అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అదానీ స్మార్ట్‌మీటర్లను అంటగట్టడం మానుకోవాలని కోరారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు





ప్రత్యేకాలంకారంలో వినాయకస్వామి, పురవీధుల్లో ఊరేగుతున్న వినాయకస్వామి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలోని ప్రధాన గణపతిస్వామి సన్నిధి వద్ద బుధవారం వినాయక చవితిని పురస్కరించుకుని వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వంహించారు. గణపతి హోమం శాస్త్రోక్తంగా చేశారు. అనంతరం వినాయక స్వామి ఉత్సవ మూర్తికి పలు రకాల అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పిం చారు. వేదమంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, మేళ తాళాల నడుమ స్వామివారిని చప్పరంపై అధిష్టింప జేశారు. మాడవీధుల్లో ఊరేగుతున్న స్వామివారికి భక్తులు కర్పూర హారతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ప్రధాన అర్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్, టీడీపీ నాయకులు చెంచయ్యనాయుడు, విజయకుమార్, బాలాజీ, సుబ్బయ్య పాల్గొన్నారు.



సారె అందజేస్తున్న ఈవో బాపిరెడ్డి

నవసంధి వినాయకులకు ముక్కంటి సారె

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలోని నాలుగు మాడ వీధుల్లో కొలువైన నవసంధి వినాయకులకు బుధవారం ఈవో బాపిరెడ్డి ముక్కంటి సారె సమర్పించారు. ఆలయంలోని అలంకార మండపంలో సారెకు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, మంగలవాయిద్యాల నడుమ ఊరేగింపుగా బయలుదేరి ఆయా వినాయకులకు సారెను అందజేశారు. ఆలయ అర్చకులు సారెను స్వామివార్లకు అలంకరించి పూజలు చేశారు. ఆలయ అధికారులు, బొజ్జల బృందమ్మ, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, కంఠా రమేష్, కాసర రమేష్, సుబ్బయ్య, మునిరాజా యాదవ్, నెమళ్ళూరు బుజ్జి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇంటివద్దకే సీఎం సహాయనిధి



చంద్రశేఖర్‌నాయుడుకు చెక్కు అందజేస్తున్న బృందమ్మ

శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం క్షీణించి ఆపదలో ఉన్న వారిని గుర్తించి ఇంటి వద్దకే సీఎం సహాయ నిధిని అందజేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ అన్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ వ్యాప్తంగా ఇటీవల పలువురికి సీఎం సహాయనిధిని అందించాల్సిందిగా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. గతంలో మంజూరైన చెక్కులను సామూహికంగా వేదికల వద్ద బాధితులకు అందజేసేవారు. అయితే సీఎం సహాయనిధిని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు స్వయంగా లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందజేసి వారి యోగక్షేమాలను ఆరా తీసేలా గురువారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి తల్లి బృందమ్మ లబ్ధిదారుల ఇంటికే వెళ్లి ఇచ్చారు. శ్రీకాళహస్తి మండలం కమ్మకొత్తూరుకు చెందిన వెంకటకృష్ణమనాయుడుకు రూ.1,05,452, మాధమాలకు చెందిన భాస్కర్‌నాయుడుకు రూ.52,912, పోలికి చెరందిన ముప్పాల కుమార్‌నాయుడుకు రూ1.41,720, ఊరందూరుకు చెందిన మహిథకు రూ.91,139 సీఎం సహాయనిధిని వారి ఇళ్ల వద్దే పంపిణీ చేశారు. ● ఇక తొట్టంబేడు మండలం లోని కొణత నేరి, చిన్నసింగమాల, లింగమ నాయుడు పల్లిలోనూ సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ల మునిరాజానాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు గాలి మురళీనాయుడు, లెక్కల మురళీనాయుడు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం



శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బంగారమ్మ ఆలయం సమీపంలో ఉన్న గివింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంతో నడుస్తున్న వృద్ధాశ్రమంలోని వారికి చెర్లోపల్లికి చెందిన గురుమూర్తి దంపతులు అన్న దానం చేశారు. తన తండ్రి చెరుకూరి మునెయ్య వర్ధంతి సందర్భంగా అన్నదానం చేశారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

శ్రీకాళహస్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి సందర్భంగా బుధవారం జనసేన నాయకులు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. జనసేన జిల్లా కార్యదర్శి కొట్టేసాయి, నాయకులు కుమార్, మాధవ మహేష్, గరికపాటి చంద్రశేఖర్, విజయ్, చిరంజీవి, సురేష్, రాఘవ, మోహన్, లీలాధర్, కవిత పాల్గొన్నారు.

వినాయకుడికి విశేషపూజలు



పురవీధుల్లో ఊరేగుతున్న శక్తి వినాయకస్వామి

నారాయణవనం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నారాయణవనంలో కొలువైన టీటీడీ అనుబంధ ఆలయమైన శక్తి వినాయకస్వామి ఆలయంలో చవితి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్య పూజాకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పుర వీదులల్లో ఊరేగించారు. భక్తులు పెద్దఎత్తున స్వామివారికి నారికేల, కర్పూర నీరాజనాలతో మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరిం టెండెంట్ ధర్మయ్య, ఏఈవో రవి, ఆలయాధికారి నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు. ● మండలంలోని అన్ని గ్రామాలలో వినాయక చవితిని ఘనంగా నిర్వహించారు. పాలమంగళంలో అభయహస్త బాల వినాయక స్వామి వారి పూజ భక్తి శ్రద్ధలతో చేపట్టారు. శివయ్య స్పైడర్ మ్యాన్ అవతారంలో బాల వినాయక స్వామి పక్కన ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

గణేశుడికి పూజలు.. అన్నదానాలు





బీఎన్‌కండ్రిగలో భక్తులకు అన్నదానం, రాజనగరంలో కలశ పూజలు

బుచ్చినాయుడుకండ్రిగ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. బీఎన్‌కండ్రిగలో నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. మండలంలో పలు గ్రామాలలో వినాయక విగ్రహాలు నిమజ్జనం చేశారు.

పిచ్చాటూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని 128 గ్రామాల్లో వినాయక చవితి వేడుకలు బుధ, గురువారాల్లో వైభవంగా నిర్వహించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించారు. అన్నదానాలు చేశారు. రాజనగరం, కొత్త గొల్లకండ్రిగలలో భారీ విగ్రహాలు దర్శనమిచ్చాయి.

సందడిగా వినాయక చవితి వేడుకలు



చిన్నపాండూరులో ఉట్టి కొడుతున్న యువకులు

సత్యవేడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి వేడుకలు సందడిగా జరిగాయి. వినాయక చవితి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక మంట పాలను ఏర్పాటు చేసి గణేశుడి విగ్రహాల ప్రతిష్ఠించారు. వినాయకుడికి భక్తి శ్రద్ధలతో పూజాది కార్యమాలు నిర్వహించి, నైవేద్యం సమర్పించారు. పలు చోట్ల సాంస్కృతిక కార్య క్రమాలు, క్రీడల పోటీలు నిర్వహించారు. ఎస్ఐ రామస్వామి ఆధ్వర్యంలో భద్రతను పర్యవేక్షించారు.

వరదయ్యపాళెం: మండలంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వాడ వాడలా విగ్రహాలను ప్రతిష్ఠించి వినాయకుడికి పూజలు నిర్వహించారు. మండలంలోని బత్తలవల్లం, సంతవేలూరు పంచాయతీలలో టీడీపీ నాయకుడు, ఎన్ఆర్ఐ నంద కిషోర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. చెన్నవారిపాలెంలో వినాయక విగ్రహ ఏర్పాటుకు టీడీపీ నాయకుడు కరుణాకర్‌రెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు.

కేవీబీపురం: మండలంలో బుధవారం జరిగిన వినాయక చవితి వేడుకలు వాడవాడలా ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి గణనాధునికి ఇష్టమైన కుడుములు, ఉండ్రాల్లు, గుగ్గిళ్లు, పిండివంటలు నైవేద్యంగా సమర్పించారు.


స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



శ్రీకాళహస్తి, ఆగస్ట 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీ వద్ద గల దేవరమిట్టలో గురువారం స్మార్ట్ రేషన్ కార్డులను సచివాలయ సిబ్బంది పంపిణీ చేశారు. టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్లూరు బుజ్జి చేతుల మీదుగా అందించారు. కార్యదర్శులు మునికృష్ణారెడ్డి, సునీల్, డీలర్లు శీను, రఘు, టీడీపీ నాయ కులు శివ, కేశవ, రవి పాల్గొన్నారు.

వాడవాడలా చవితి సంబరాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో బుధవారం వాడవాడలా వినాయక చవితి సంబరాలు నెలకొన్నాయి. భక్తులు మండపాలలో ప్రతిష్ఠించిన గణేశుడికి పూజలు చేశారు. ఉండ్రాళ్లు, కుడుములు నైవేద్యంగా సమర్పించారు. బాబుఅగ్రహారం కూడలి వద్ద నవభారత్ యువజన సంఘం ఏర్పాటు చేసిన అయ్యప్ప గణపతి, ఓటేరు కాలువ వీధిలో ఏర్పాటు చేసిన నరసింహవినాయకుడు, కైకాలవీధిలో ఏర్పాటు చేసిన శ్రీ-కాళ-హస్తి గణపతి ప్రతిమలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పట్టణవ్యాప్తంగా పలు మండపాల్లో వినాయక ప్రతిమలను కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివార్లను దర్శించుకున్నారు. నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.









కైకాలవీధిలో శ్రీకాళహస్తి గణపతి, బాబుఅగ్రహారం వద్ద నవభారత్ యువజన సంఘం ఏర్పాటు చేసిన అయ్యప్ప గణపతి, వరదరాజస్వామి ఆలయ సమీపంలో ఏర్పాటుచేసిన గణపతి, పెండ్లిమండపం వద్ద వినాయకుడు